మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి..

PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 18-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 19 Issue: 19

18 జూలై 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి పంచమి తె. 3:44 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) సా. 6:02 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం వారియ రా. 8:44 వరకు కరణం బవ సా. 4:13 వరకు భాలవ తె. 3:44 వరకు వర్జ్యం రా. 1:15 నుండి రా. 2:52 వరకు దుర్ముహూర్తం ఉ. 7:38 నుండి ఉ. 8:29 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:45 వరకు యమగండం మ. 1:59 నుండి మ. 3:36 వరకు గుళికాకాలం తె. 5:54 నుండి ఉ. 7:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు ఉ. 11:44 నుండి మ. 1:18 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# మొగుడికి మూడింది!

## గత ఆర్నెల్లలో 554 మంది భర్తల హత్యలు, ఆత్మహత్యలు

### ప్రతిరోజూ ఇద్దరు హత్య.. ఒకరికి పైగా ఆత్మహత్య.. 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదికలో సంచలన గణాంకాలు

దేశంలో భర్తలపై జరుగుతున్న హింస, హత్యలు, ఆత్మహత్యల ఘటనలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని గురుగ్రామ్‌కు చెందిన 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. 2026 జనవరి 1 నుంచి జూలై 14 వరకు దేశవ్యాప్తంగా మీడియాలో వెలువడిన వార్తలు, సంస్థ స్వయంగా సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 554 మంది భర్తలు హత్యలకు గురికావడం లేదా ఆత్మహత్యలకు పాల్పడడం నమోదైంది. నివేదిక ప్రకారం, ఈ కాలంలో 322 మంది భర్తలు హత్యకు గురికాగా, 232 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

న్యూఢిల్లీ: ఈ గణాంకాలను బట్టి దేశంలో ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరికి పైగా భర్త ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని ఫౌండేషన్ పేర్కొంది. అయితే, ఈ సంఖ్యలు అధికారిక ప్రభుత్వ గణాంకాలు కావని, కేవలం మీడియా నివేదికలు మరియు సంస్థ సేకరించిన సమాచారంపై ఆధారపడినవేనని ఫౌండేషన్ స్పష్టం చేసింది. మీడియాలో వెలుగులోకి రాని అనేక ఘటనలు ఉండే అవకాశం ఉన్నందున, వాస్తవ సంఖ్యలు ఇంకా ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. భర్తల హత్యలకు ప్రధాన కారణంగా వివాహేతర సంబంధాలు ఉన్నట్లు ఈ నివేదిక తేల్చింది. నమోదైన 322 హత్య కేసుల్లో 194 కేసులు (60.2%) ఈ కారణంతోనే జరిగినట్లు వెల్లడించింది. భార్యల వివాహేతర సంబంధాలను భర్తలు వ్యతిరేకించడం, అడ్డుకోవడం లేదా ప్రశ్నించడం వల్ల, కొన్నిచోట్ల భార్యలు తమ ప్రియులతో కలిసి భర్తలను హత్య చేసినట్లు కేసుల వివరాలు సూచిస్తున్నాయని తరువాయి 2 వ పేజీలో...

## లైవ్ లొకేషన్ పంపి భర్త హత్య

# ప్రియుడితో కలిసి భార్య కిరాతకం

### కూతురి కళ్ల ముందే వేటకొడవళ్లతో దాడి

### ఏపీలోని చిత్తూరు జిల్లాలో దారుణం



చిత్తూరు, జూలై 17 (ఈవార్తలు): ప్రియుడి వ్యామోహంలో పడి కట్టుకున్న భర్తనే కిరాతకంగా అంతమొందించింది ఓ భార్య. గుడికి వెళ్దామని నమ్మించి, లైవ్ లొకేషన్ ద్వారా భర్త కదలికలను ఎప్పటికప్పుడు ప్రియుడికి చేరవేసి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. చిత్తూరు జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటనకు సంబంధించి 19 ఏళ్ల హాసిని, ఆమె ప్రియుడు యుగంధర్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా సూళగిరికి చెందిన రమేశ్ (23)కు, హాసినికి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే, వివాహానికి ముందు నుంచే హాసిని తన చిన్ననాటి స్నేహితుడు యుగంధర్ (20)తో వివాహేతర సంబంధం తరువాయి 2 వ పేజీలో...

# భూమి కొంటే భారతీయుడివైపోతవా?

### భూ రికార్డులు పౌరసత్వానికి రుజువు కాదు.. విదేశీయుడి కేసులో కలకత్తా హైకోర్టు తీర్పు

భూమి రికార్డులుభారత పౌరసత్వానికి రుజువు కావని కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. బంగ్లాదేశీ చొరబాటుదారుడనే ఆరోపణలతో జూన్‌లో బెంగాల్‌లో అదుపులోకి తీసుకున్న నాసిర్ మొల్లా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఒక విదేశీయుడు భారతదేశంలో ఆస్తి కొనుగోలు చేసినంత మాత్రాన అతను భారత పౌరుడు అయినట్లు కాదు. విదేశీయులు భారతదేశంలో ఆస్తిని కొనుగోలు చేయవచ్చు.. అంత మాత్రాన, అతడు దానంతట అదే భారత పౌరులుగా మారిపోరు' అని కోర్టు తన ఉత్తర్వులో స్పష్టం చేసింది.

కోల్‌కతా: భారత పౌరసత్వానికి పాస్‌పోర్ట్ రుజువు కాదంటూ కేంద్రం చేసిన ప్రకటనపై చర్చ జరుగుతోన్న సందర్భంలో కలకత్తా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న మొల్లా తరఫున అతడి బంధువు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిర్బంధంలో ఉన్న వ్యక్తి భారత జాతీయుడని అతని తరఫు లాయర్ వాదించగా.. తాను విదేశీయుడని - 2 వ పేజీలో...



# పౌరసత్వాన్ని మీరు నిర్ణయిస్తారా?



### ఈసీకి ఆ అధికారం లేదు.. సర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం సంచలన వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదని, ఓటర్ల జాబితాపై మాత్రం దానికి అథారిటీ ఉంటుందని స్పష్టం చేసింది. ఓటరు జాబితాలో పేరు లేనంత మాత్రం పౌరసత్వం పోదని తేల్చిచెప్పింది.


న్యూఢిల్లీ: బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక ట్రిబ్యునల్స్ వారి అప్పీళ్లను తిరస్కరిం చిన తర్వాత ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన వ్యక్తులకు ప్రభుత్వ పథకాల కింద లభించే సంక్షేమ ప్రయోజనాలను నిలిపివేయకూడదని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన్‌ల ధర్మాసనం... కేంద్ర ఎన్నికల సంఘం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది. ఈ వ్యవహారంపై జులై 25లోపు విచారణ జాబితా చేసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,253 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,151 |

## విశ్వవాణి



బ్రెయిన్ ట్యూమర్స్ చికిత్సలో కీలక ముందడుగు పడే అవకాశం కనిపిస్తోంది. క్యాన్సర్ కణాల్లో మాత్రమే ఏర్పడే అసాధారణ ప్రోటీన్లను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి రోగనిరోధక వ్యవస్థకు హెచ్చరిక సంకేతాల్లా పనిచేసి, ఆరోగ్యకరమైన మెదడు కణాలకు హాని కలిగించకుండా క్యాన్సర్ కణాలను గుర్తించి నాశనం చేయడంలో భవిష్యత్తులో కీలక పాత్ర పోషించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. పరిశోధకుల వివరాల ప్రకారం, క్యాన్సర్ కణాలు జన్యు సమాచారాన్ని చదివి ప్రోటీన్లను తయారు చేసే ప్రక్రియలో అప్పుడప్పుడు పొరపాట్లు జరుగుతాయి. ఫలితంగా సాధారణ కణాల్లో కనిపించని కొత్త రకమైన ప్రోటీన్ ముక్కలు ఏర్పడి, అవి ట్యూమర్ కణాల ఉపరితలంపై కనిపిస్తాయి. వీటిని ఆధారంగా చేసుకుని రోగనిరోధక కణాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం లేదా వ్యక్తిగత అవసరాలకు

# ఇక ధరణి వంతు!

## పోర్టల్ అక్రమాలపై దర్యాప్తునకు సిట్

### బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్పు.. తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కీలక అంశాలపై చర్చించిన కేబినెట్.. ముఖ్యంగా ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూముల లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేయనున్నారు.


హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): టెక్నికల్ నిపుణులు, వివిధ శాఖల అధికారులతో ఈ సిట్ పనిచేయనుండగా.. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అదే సమావేశంలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు సంబంధించిన అలైన్‌మెంట్ మార్పులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల, చిన్న కాళేశ్వరం, సీతారామ నీటిపారుదల ప్రాజెక్టుల పెరిగిన అంచనా వ్యయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు.. విద్యారంగంలో భాగంగా డిగ్రీ కళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి కూడా అనుమతి మంజూరైంది. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం తరువాయి 2 వ పేజీలో...

# మద్యం.. కిక్!

### ఫిఫా ఫైనల్ వేళ హైదరాబాద్‌లో బార్ల వేళల పొడిగింపు

### తెల్లవారుజామున 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి

### మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 వరకు



ఫిఫా ప్రపంచ కప్ 2026 తుది అంకానికి చేరుకున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రపంచ కప్ ఫైనల్ పోరుతో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ల దృష్ట్యా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బార్లు, క్లబ్బులు, మైక్రో బ్రూవరీలను నిర్ణీత సమయం కంటే అదనంగా తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది.

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జూలై 18 రాత్రి మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్ సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల వరకు మద్యం సరఫరాకు వెసులుబాటు కల్పించారు. అలాగే, జూలై 19న అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య రాత్రి జరగనున్న తరువాయి 2 వ పేజీలో...

# ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్లు

### ఒంటరి, వింతతు మహిళలకు లబ్ధి

### పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ప్రకటన



తెలంగా ణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన ఒంటరి మహిళలు, వితం తువులు సహా కొత్త లబ్ధిదారులకు ఆగస్ట్ 15వ తేదీ నుంచి పింఛన్లు అందజేయ నున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు.

ములుగు, జూలై 17 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటన సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబ ఆధారం లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని భావిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కొత్త పింఛన్ల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలు తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్‌ను మించి అమరావతి

### భాగ్యనగరాన్ని చూస్తే అసూయగా ఉంది

### కట్టుబట్టలతో బయటకు పంపించారు

### వేరే రాష్ట్రాల యువత ఏపీవైపు చూసేలా చేస్తా

### ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు



అమరావతి, జూలై 17 (ఈవార్తలు): హైదరాబాద్‌ను మించి అమరావతిని అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రసంగించిన నారా లోకేశ్.. ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 60 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని.. అయితే 2014 రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలను కట్టుబట్టలతో బయటకు తరువాయి 2 వ పేజీలో...

# బీఆర్ఎస్ సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): యూత్ డిక్లరేషన్ పేరిట యువతను వంచించిన కాంగ్రెస్ పార్టీని ఎండ గట్టడానికి బీఆర్ఎస్ పార్టీ రేపు తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చింది. శనివారం సరూర్ నగర్‌లో జరిగే సదస్సు కోసం ఇప్పటికే బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాయి. ఈ సభకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు గత రెండు వారాల క్రితమే పోలీసుల ను కోరగా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు కోర్టును ఆశ్రయించారు. అనుమతి విషయం శుక్రవారం కోర్టులో విచారణకు రాగా, పరిశీలించిన న్యాయమూర్తి అనుమతి ఇవ్వాలంటూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. యువ సంగ్రామ సదస్సుపై 17 రోజులుగా అనుమతి నిర్ణయం ఎందుకు తీసుకోలేదంటూ కోర్టు పోలీసులను ప్రశ్నించింది.

## రాశి ఫలాలు

18.7.2026

మేషం: ఉద్యోగ రంగంలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఆకస్మిక ధనలాభం కలిగే అవకాశాలు బలంగా ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు మరియు ఇంట్లో ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది.

వృషభం: చేపట్టిన పనులన్నీ సకాలంలో విజయవంతంగా పూర్తవుతాయి. బంధువుల నుండి ఒక శుభవార్త వినే అవకాశం ఉంది. అయితే, అనవసరపు ఖర్చులు పెరిగే అవకాశం ఉంది కాబట్టి ఆర్థిక విషయాల్లో కొంచెం నియంత్రణ అవసరం.

మిథునం: నూతన పరిచయాలు ఏర్పడతాయి, ఇవి భవిష్యత్తులో మీకు ఎంతగానో లాభిస్తాయి. వ్యాపార రంగంలో ఉన్నవారికి ఆశించిన స్థాయిలో మంచి లాభాలు వస్తాయి. ఈరోజు దూర ప్రయాణాలు వీలైనంత వరకు వాయిదా వేసుకోవడం మంచిది.

కర్కాటకం: కార్యాలయంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పటికీ, మీ పట్టుదలతో పనులన్నింటినీ సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుండి పూర్తి మద్దతు లభిస్తుంది. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం శ్రేయస్కరం.

సింహం: సమాజంలో మీ గౌరవ మర్యాదలు మరియు కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. మిత్రులతో కలిసి విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి గతంలో కంటే చాలా మెరుగ్గా ఉంటుంది.

కన్య: ఉద్యోగంలో సానుకూల మార్పులు లేదా పదోన్నతికి సంబంధించిన సూచనలు ఉన్నాయి. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. మనస్సు ఎంతో ప్రశాంతంగా, ఉత్సాహంగా ఉంటుంది.

తుల: చేపట్టిన పనులలో కొన్ని చిన్నపాటి ఆటంకాలు ఎదురైనప్పటికీ, ధైర్యంతో వాటిని అధిగమిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకుండా, అనవసర వివాదాలకు దూరంగా ఉండటం ఎంతైనా మంచిది.

వృశ్చికం: నూతన పెట్టుబడులు పెట్టడానికి లేదా కొత్త పనులు ప్రారంభించడానికి ఈరోజు ఎంతో అనుకూలమైన సమయం. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నాయి. పూర్తి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి విజయం సాధిస్తారు.

ధనస్సు: కుటుంబంలో శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన మంచి పురోగతి కనిపిస్తుంది. కుటుంబ పెద్దల ఆశీస్సులు, సలహాల వల్ల చేసే పనుల్లో మేలు జరుగుతుంది.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు పెరిగే అవకాశం ఉంది, కాబట్టి బడ్జెట్ ప్లాన్ ప్రకారం నడుచుకోవడం ముఖ్యం. కార్యాలయంలో సహోద్యోగులతో మాట్లాడేటప్పుడు ఓర్పు, నిదానం వహించడం మంచిది.

కుంభం: వృత్తి,వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆకస్మిక విజయం పొందుతారు.శుభకార్యాలకు కుటుంబ సభ్యులతో హాజరావుతారు. నూతన గృహ కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి రావచ్చు. పనుల్లో శారీరక శ్రమ తప్పదు.

మీనం: సన్నిహితుల నుండి వివాదాలకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ఆత్మీయుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి.

# మొగుడికి మూడింది!

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొంది. మిగిలిన కేసుల్లో ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, ఇతర వ్యక్తిగత కారణాలు కూడా ఉన్నట్లు తెలిపింది.

### 232 మంది భర్తల ఆత్మహత్యలు

ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 232 మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదిక వెల్లడించింది. వీటిలో 104 కేసులు (44.83%) – దీర్ఘకాలిక వైవాహిక వివాదాలు, కుటుంబ కలహాలు, 57 కేసులు (24.57%) – భార్యలు లేదా అత్తమామల వేధింపుల ఆరోపణలు, 29 కేసులు (12.50%) – వివాహేతర సంబంధాలకు సంబంధించిన సమస్యలు, మిగిలిన కేసులు – తప్పుడు క్రిమినల్ కేసుల భయం, ప్రియురాళ్లు లేదా వారి కుటుంబ సభ్యుల వేధింపులు, ఆర్థిక ఒత్తిళ్లు, ఇతర వ్యక్తిగత కారణాలు ఉన్నాయి. అనేక మంది బాధితులు ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్లు, వీడియో సందేశాలు వదిలి వెళ్లినట్లు నివేదిక పేర్కొంది. తమపై జరుగుతున్న మానసిక వేధింపులు, గృహ హింస, పిల్లలను కలుసుకోనివ్వకపోవడం, నిరంతర అవమానాలు వంటి కారణాలను వారు అందులో ప్రస్తావించినట్లు తెలిపింది.

### యూపీలో అత్యధిక కేసులు

ఈ నివేదిక ప్రకారం రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధిక ఘటనలు నమోదయ్యాయి. అక్కడ 93 మంది భర్తలు హత్యకు గురయ్యారు. 103 మంది భర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. అదనంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా అధిక సంఖ్యలో కేసులు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. అయితే, భర్తలపై గృహహింస, హత్యలు, వేధింపులకు సంబంధించిన ఘటనలను ప్రత్యేకంగా నమోదు చేసే జాతీయ స్థాయి అధికారిక డేటాబేస్ ప్రస్తుతం లేదని ఫౌండేషన్ పేర్కొంది. దీని వల్ల సమస్య తీవ్రత ఎంత మేర ఉందో ఖచ్చితంగా అంచనా వేయడం కష్టమవుతోందని తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసును కూడా ఈ నివేదికలో ప్రస్తావించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దీపికా నారాయణ్ భరద్వాజ్ మాట్లాడుతూ, కేతన్ అగర్వాల్‌ను అతడి కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ కలిసి లోయలోకి తోసి హత్య చేసిన ఘటన దేశాన్ని కుదిపేసిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తరచుగా వెలుగులోకి వస్తున్నప్పటికీ, పురుష బాధితులకు సంబంధించిన ప్రత్యేక అధికారిక గణాంకాల లేమి వల్ల సమస్య అసలు పరిమాణం బయటపడటం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. నివేదికలోని గణాంకాలపై ఫౌండేషన్ కొన్ని కీలక స్పష్టీకరణలు కూడా చేసింది. ఇవి జాతీయ నేర రికార్డుల బ్యూరో విడుదల చేసిన అధికారిక గణాంకాలు కావు. మీడియా కథనాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సమాచారం, స్వీయ సేకరణ ఆధారంగా రూపొందించిన నివేదిక. మీడియాకు తెలియని అనేక కేసులు ఇందులో లేకపోవచ్చు. అందువల్ల ఈ నివేదికను అధికారిక ప్రభుత్వ డేటాతో సమానంగా పరిగణించరాదని పేర్కొంది.



**అత్యంత దారుణమైన 25 కేసులు**

- తల నరికి హత్య చేయడం
- శరీరాన్ని ముక్కలుగా నరికి పారవేయడం
- విషప్రయోగం
- ఇంటి నేల కింద పాతిపెట్టడం
- సజీవ దహనం
- లోయల్లోకి తోసేయడం
- భార్యలు లేదా వారి ప్రియులతో కలిసి కుట్రపూర్వక హత్యలు

**మొత్తం ఘటనలు (జనవరి 1 - జూలై 14, 2026)**

| అంశం | సంఖ్య |
|---|---|
| మొత్తం ఘటనలు | 554 |
| హత్యలు | 322 |
| ఆత్మహత్యలు | 232 |
| రోజుకు సగటు హత్యలు | 2 |
| రోజుకు సగటు ఆత్మహత్యలు | 1కంటే ఎక్కువ |

**హత్యలకు ప్రధాన కారణాలు**

| కారణం | కేసులు | శాతం |
|---|---|---|
| వివాహేతర సంబంధాలు | 194 | 60.2% |
| ఇతర కారణాలు | 128 | 39.8% |

**ఆత్మహత్యలకు కారణాలు**

| కారణం | కేసులు | శాతం |
|---|---|---|
| దీర్ఘకాలిక వైవాహిక వివాదాలు | 104 | 44.83% |
| భార్య/అత్తమామల వేధింపులు | 57 | 24.57% |
| వివాహేతర సంబంధాలు | 29 | 12.50% |
| ఇతర కారణాలు | 42 | 18.10% |

# పౌరసత్వాన్ని మీరు నిర్ణయిస్తరా?

**మొదటి పేజీ తరువాయి**

చేసిన ఈ పిటిషన్‌లో, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన, ప్రజా పంపిణీ వ్యవస్థ, అన్నపూర్ణ పథకం, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందించే ఇతర సంక్షేమ పథకాల నుంచి మినహాయించకూడదని వాదించారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్.. ప్రత్యేక ట్రిబ్యునళ్ల ముందు సుమారు 34 లక్షల అప్పీళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అయితే మీడియా నివేదికల ప్రకారం ఇప్పటివరకు కేవలం 38,000 అప్పీళ్లపై మాత్రమే తీర్పు వెలువడిందని తెలిపారు. అప్పీళ్లను విచారించేందుకు కేవలం 19 ట్రిబ్యునళ్లు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఇద్దరు న్యాయమూర్తులు ఇప్పటికే రాజీనామా చేశారని కూడా ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా నుంచి తొలగింపు వల్ల కలిగే పరిణామాలను ప్రస్తావిస్తూ.. ప్రభావితమైన వారు ప్రజా సంక్షేమ పథకాలు, హక్కులకు దూరమవుతున్నారని శంకరనారాయణన్ వాదించారు. "ప్రస్తుతం ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించడం వల్ల ఎదురయ్యే పరిణామాలు... రేషన్, అన్నపూర్ణ పథకం, కుల ధ్రువీకరణ పత్రాలు, వెరిఫికేషన్‌పై పడుతున్నాయి" అని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు, వారి పౌరసత్వ స్థితికి సంబంధించిన సమస్యలు తుది పరిష్కారం కాకముందే ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దీనికి జస్టిస్ జోయమాల్య బాగ్చీ స్పందిస్తూ.. బీహార్ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే ఈ అంశంపై స్పష్టతనిచ్చిందని తెలిపారు. "మాకు ఈ విషయంపై అవగాహన ఉంది.. బిహార్ ఎస్ఐఆర్ తీర్పులో మేము ఒక విషయాన్ని స్పష్టం చేశాం.. ఓటింగ్ హక్కులపై ఈసీఐ నిర్ణయం తీసుకున్నంత మాత్రాన అది పౌరసత్వాన్ని నిర్ధారించలేదని స్పష్టం చేశాం.. పౌరసత్వ చట్టం కింద ఈ విషయాన్ని తుది పరిష్కారం కోసం సంబంధిత మంత్రిత్వ శాఖకు నివేదించాల్సిన బాధ్యత కూడా ఈసీఐకి ఉంది" అని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. చట్టపరంగా పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ, బాధితులు తక్షణ ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారని శంకరనారాయణన్ వాదించారు. "ఈ సంక్షేమ పథకాలన్నింటినీ వారి నుంచి తొలగిస్తారని మీరు (కోర్టు) గానీ, మేము గానీ ఊహించలేదు" అని అన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించడం వలన ఎదురయ్యే పరిణామాలు... రేషన్, అన్నపూర్ణ పథకం, కుల ధృవీకరణ పత్రాలు మరియు వెరిఫికేషన్‌లపై పడుతున్నాయి," అని ఆయన కోర్టుకు సమర్పించారు. అంతేకాకుండా, వారి పౌరసత్వ స్థితికి సంబంధించిన సమస్యలు తుది పరిష్కారానికి నోచుకోకముందే ప్రజలు ఈ ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ, బీహార్ 'ప్రత్యేక ముమ్మర సవరణ' ప్రక్రియకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే ఈ అంశంపై స్పష్టతనిచ్చిందని పేర్కొన్నారు.

"మాకు ఈ విషయంపై అవగాహన ఉంది. మా బీహార్ 'సర్' తీర్పులో మేము ఒక విషయాన్ని స్పష్టం చేశాం; ఓటింగ్ హక్కులపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నంత మాత్రాన, అది పౌరసత్వాన్ని నిర్ధారించలేదని స్పష్టం చేశాం. పౌరసత్వ చట్టం కింద ఈ అంశాన్ని తుది పరిష్కారం కోసం సంబంధిత మంత్రిత్వ శాఖకు రిఫర్ చేయాల్సిన బాధ్యత కూడా ఈసీఐపై ఉంది," అని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఓటర్ల జాబితా నుంచి తొలగించడం వల్ల ఓటు హక్కులు శాశ్వతంగా రద్దు కావని పేర్కొంది. ఓటర్ల జాబితాపై మాత్రమే ఈసీకి నియంత్రణ, పర్యవేక్షణ అధికారం ఉందని పునరుద్ఘాటించింది.

# ఇక ధరణి వంతు!

**మొదటి పేజీ తరువాయి**

చేసే దిశగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70(3) సవరణకు కూడా తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీకి కాకుండా నేరుగా ఆయా గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక.. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా ధరణి అక్రమాలపై సిట్ ఏర్పాటు నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశముండగా, ప్రభుత్వం తీసుకున్న ఇతర నిర్ణయాలు కూడా పరిపాలన, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమివ్వనున్నాయి.

# మద్యం.. కిక్!

**మొదటి పేజీ తరువాయి**

ఫైనల్ మ్యాచ్ కోసం తెల్లవారుజామున 3 గంటల వరకు బార్లను తెరిచి ఉంచేందుకు అనుమతించారు. ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లేదా ఆ తర్వాత ప్రారంభమవుతుండటంతో అభిమానులు తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. పబ్లిక్ ప్లేసుల్లో ఇతరులతో కలిసి బిగ్ స్క్రీన్లపై వీక్షించే అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో బార్ల పనివేళలను పొడిగించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జూలై 14న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన రెవెన్యూ శాఖ తాజాగా అనుమతులు మంజూరు చేయగా, ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఫుట్‌బాల్ ప్రేమికులు స్నేహితులతో కలిసి బిగ్ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను తిలకిస్తూ ఆనందించే అవకాశం లభించింది. అయితే, పొడిగించిన పనివేళల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులు స్పష్టం చేశారు.

## ప్రియుడితో కలిసి భార్య కిరాతకం

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగిస్తోంది. ఈ క్రమంలో, అమావాస్యను పురస్కరించుకుని గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలిసిన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయ దర్శనానికి వెళదామని హాసిని తన భర్తను నమ్మించింది. భర్త, కుమార్తెతో కలిసి బైక్‌పై వెళుతూనే, హాసిని తన లైవ్ లొకేషన్‌ను ప్రియుడు యుగంధర్‌కు షేర్ చేసింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, కొండపైకి వెళ్లే మార్గంలోని మూడో హెయిర్‌పిన్ బెండ్ వద్దకు చేరుకోగానే, తన హ్యాండ్‌బ్యాగ్ కింద పడిపోయిందని చెప్పి భర్తతో బండిని ఆపించింది. వెంటనే అక్కడికి చేరుకున్న యుగంధర్, అతని స్నేహితులు రమేశ్‌ను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో అత్యంత దారుణంగా నరికి చంపారు. ఈ ఘోరం జరుగుతున్న సమయంలో వారి చిన్నారి కుమార్తె అక్కడే ఉండటం గమనార్హం. రమేశ్, హాసినిలు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన హాసిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆలయ మార్గంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా కీలక ఆధారాలు లభించాయి. రమేశ్‌తో కలిసి వెళ్లిన హాసిని, తిరుగు ప్రయాణంలో మాత్రం వేరే వ్యక్తులతో కలిసి బైక్‌పై వెళ్లడాన్ని పోలీసులు గుర్తించారు. నిందితుల మొబైల్ రికార్డులు, లొకేషన్ డేటా ఆధారంగా గాలించిగా రమేశ్ మృతదేహం లభ్యమైంది. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, హాసిని ఫోన్ పరిశీలించి ప్రియుడికి లైవ్ లొకేషన్ పంపిన ఆధారాలను సేకరించారు.

## భూమి కొంటే భారతీయుడివైపోతవా?

**మొదటి పేజీ తరువాయి**

ఒప్పుకున్నాడని ప్రభుత్వం తెలిపింది. దీంతో తన భారత పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలను సమర్పించాలని కోర్టు పిటిషనర్‌ను కోరింది. "కోర్టు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. భూమి రికార్డులు మినహా నిర్బంధంలో ఉన్న వ్యక్తి భారత పౌరసత్వాన్ని నిశ్చయంగా నిరూపించే ఎలాంటి పత్రాన్ని రిట్ పిటిషన్‌కు జతచేయలేదని పిటిషనర్ తరఫున హాజరైన లాయర్ సమర్పించారు" అని కోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. 'పిటిషనర్ పదే పదే ప్రస్తావించిన భూమి రికార్డులు, భారత పౌరసత్వానికి రుజువు పత్రం కాదు" అని వివరించింది. తాను భారత పౌరుడని నిరూపించే ఏదైనా పత్రాన్ని సమర్పించడానికి కోర్టు పిటిషనర్‌కు జులై 20 వరకు మరో అవకాశం ఇచ్చింది. 'భారతీయ పౌరసత్వాన్ని నిరూపించే ఏ పత్రాన్నైనా రిట్ పిటిషనర్ ఆ సమయానికల్లా అఫిడవిట్ ద్వారా సమర్పించవచ్చు అని తెలిపింది. భారత పౌరసత్వానికి భూమి పత్రాలు ఎన్నడూ రుజువు కాదని వర్గాలు తెలిపాయి. సాంకేతికంగా ఈ పత్రాలను పౌరులు కాని వారికి కూడా ఇవ్వవచ్చని అన్నాయి. 2013 నాటి ఒక తీర్పులో బాంబే హైకోర్టు ఇదే విషయాన్ని పేర్కొంటూ.. చట్టం ప్రకారం పౌరులు కాని వారికి పాస్‌పోర్ట్‌లు జారీచేసే అవకాశం ఉన్నందున కేవలం వాటిని కలిగి ఉన్నతమాత్రాన దానిని పౌరసత్వానికి 'నిశ్చయాత్మక' లేదా 'తుది' ఆధారంగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

## ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్లు

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నిజమైన అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేదా అవకతవకలకు తావు లేకుండా పెన్షన్ల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎవరైనా మరణించి ఉంటే.. వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. అలా మిగిలే నిధులను కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనర్హులు పింఛన్లు పొందకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌ను మించి అమరావతి

**మొదటి పేజీ తరువాయి**

పంపించారని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ అభివృద్ధిని చూస్తుంటే తనకు అసూయగా అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను గుర్తు చేశారు. ఆ సమయంలో ఎదురైన పరిస్థితులే తనలో పట్టుదలను, కసిని పెంచాయని లోకేశ్ పేర్కొన్నారు. అదే కసి, అదే స్ఫూర్తితో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నారా లోకేశ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఉద్యోగాల కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని.. మరో 3 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల యువతే ఆంధ్రప్రదేశ్ వైపు చూసే పరిస్థితి తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధాని నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్ల పాటు నిలిపివేసిందని నారా లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం రాజధాని అమరావతి అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌ను మించిన ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. నారా లోకేశ్ చేసిన హైదరాబాద్‌ను చూస్తే అసూయగా ఉంది.. కట్టుబట్టలతో బయటకు పంపించారు అనే వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి.



# తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభం

**జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ**

చండీగఢ్: దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది నిదర్శమని కొనియాడారు. ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి. పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.



## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల, జూలై 17 (ఈవార్తలు): ఆషాఢ మాసం శుక్రవారం తదియ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేసి, ఒడి బియ్యాన్ని సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కుంకుమ పూజ అనంతరం నిర్వహించిన లక్కీ డిప్ ద్వారా ఎంపికైన ఓ భక్తురాలికి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకుల ఆశీర్వాదాలతో అందజేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి ముడుపులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వడ్లగట్ట స్వాతి, జ్యోతి, శోభ, పుష్ప, కవిత, శివాని, అంజలి, గంగమ్మ, ఆలయ అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ విద్యార్థులకు 'కల్మా' హోంవర్క్ ఖండనీయం

**వీహెచ్‌పీ ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి**



హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): హిందూ విద్యార్థులకు ఇస్లాం మతానికి సంబంధించిన హోంవర్క్ ఇవ్వడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఏ మతానికైనా సంబంధించిన బోధనను విద్యార్థులపై బలవంతంగా రుద్దకూడదని ఆయన అన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నారులకు వారి ఇష్టానికి వ్యతిరేకంగా మతపరమైన అంశాలను బోధించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని బాలస్వామి అన్నారు. విద్యాసంస్థలు మత ప్రచార వేదికలు కాకుండా, అన్ని వర్గాల విద్యార్థులు సమానంగా విద్యను అభ్యసించే ప్రదేశాలుగా ఉండాలని పేర్కొన్నారు. ఇటీవల ఆర్మూర్‌లో జరిగిన ఘటన తర్వాత మళ్లీ ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. ఈ అంశంపై వీహెచ్‌పీతో పాటు సమాజంలోని మేధావులు, విద్యావేత్తలు కూడా స్పందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి సమగ్ర విచారణ జరపాలని, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలస్వామి డిమాండ్ చేశారు. విద్యాలయాలు మతమార్పిడి కేంద్రాలు కాదని, విద్యార్థుల మత స్వేచ్ఛను గౌరవించే వాతావరణాన్ని ప్రభుత్వం నిర్ధారించాలని ఆయన అన్నారు.

## బతుకమ్మకుంటపై హైకోర్టు తేల్చాల్సిందే

**సుప్రీంకోర్టులో హైడ్రాకు ఊరట**

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటుపడుతున్న హైడ్రాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటపై నడుస్తున్న వివాదాన్ని హైకోర్టు తేల్చాలని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. బతుకమ్మకుంట ఫెన్సింగ్స్‌పై హైడ్రా చెబుతున్న అంశాలను పరిశీలించాలని హైకోర్టుకు సూచనలు చేసింది. భూమి హక్కులకు సంబంధించిన వివాదం కోర్టులో పెండింగ్ ఉన్న నేపథ్యంలో బతుకమ్మకుంట స్థలాన్ని యథాతథంగా ఉంచాలన్న ఉత్తర్వులను హైడ్రా ఉల్లంఘించడంపై హైకోర్టు నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే. తాము ఆదేశించినప్పటికీ దానిని ఖాతరు చేయకుండా ఆదేశాలకు విరుద్ధంగా పునరుద్ధరణ పనులు చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్య కోర్టు ధిక్కరణేనని తేల్చిచెప్పింది.




## 15 ఏండ్ల తర్వాత ఈఎస్ఐలో భారీ నియామకాలు

**డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి.. 247 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేత**

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): రాష్ట్రంలోని కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో దాదాపు 15 ఏళ్ల తర్వాత తెలంగాణ ఈఎస్ఐలో భారీ స్థాయిలో స్టాఫ్ నర్సుల నియామకాలు చేపట్టామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు–గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపికైన 247 మంది స్టాఫ్ నర్సులకు శుక్రవారం కొమురం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, 2011 తర్వాత ఈఎస్ఐ శాఖలో ఇదే తొలి భారీ ప్రత్యక్ష నియామక ప్రక్రియ అని పేర్కొన్నారు. కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, అందుకే సిబ్బంది కొరతను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబాలతో కలిపి దాదాపు 75 లక్షల మంది లబ్ధిదారులకు ఈఎస్ఐ సేవలు అందుతున్నాయని తెలిపారు. ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవల కోసం వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మందులు, ఆధునిక పరికరాలు సమృద్ధిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో ఈఎస్ఐ ఆస్పత్రులపై సమగ్ర సమీక్ష నిర్వహించామని తెలిపారు. రూ.72 కోట్ల బకాయిలు విడుదల చేసి మందుల కొరతను నివారించడంతో పాటు నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఈఎస్ఐ ఆస్పత్రులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సమావేశమై రాష్ట్ర అవసరాలపై చర్చించినట్లు వెల్లడించారు. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు రామచంద్రాపురంలో డయాలసిస్ యూనిట్, కార్డియాక్ కేర్ సెంటర్, నాచారం ఈఎస్ఐలో డయాలసిస్ సేవల విస్తరణతో పాటు కార్డియాక్ సేవల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రామగుండం, శంషాబాద్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం ప్రాంతాల్లో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని, 12 నుంచి 18 నెలల్లో అన్ని ఈఎస్ఐ ఆస్పత్రులను దశలవారీగా ఆధునికీకరిస్తామని చెప్పారు. ఈఎస్ఐ శాఖలో మొత్తం 599 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు మంత్రి వెల్లడించారు.

## 'తాజ్' హోటల్స్‌కు రూ.20 లక్షల జరిమానా

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు కీలక తీర్పుతో హైదరాబాద్‌లోని రెండు ప్రముఖ హోటల్ సంస్థలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విద్యుత్ క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ డిమాండ్ నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన 2 రిట్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడమే కాకుండా.. కోర్టుకు కీలక విషయాలను దాచిపెట్టినందుకు చెరో రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల జరిమానా విధించింది. జస్టిస్ నాగేష్ భీమపాక ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అబిడ్స్‌లోని బి. సుందర్ రావు హోటల్స్ (తాజ్ మహల్ హోటల్), సికింద్రాబాద్‌లోని సుందర్ తాజ్ మహల్ హోటల్స్ (హోటల్ తాజ్ ట్రిస్టార్).. టీజీఎస్‌పీడీసీఎల్ జారీ చేసిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ డిమాండ్ నోటీసులను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించాయి. ఇందులో ఒక హోటల్‌కు రూ.27.5 లక్షలు, మరో హోటల్‌కు రూ.77.7 లక్షల బకాయిలు చెల్లించాలని టీజీఎస్‌పీడీసీఎల్ నోటీసులు జారీ చేసింది. తాము రైన్ కాల్సినింగ్ సంస్థ నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేస్తున్నందున 2005 నాటి నిబంధనల ప్రకారం సర్‌చార్జ్ చెల్లించాల్సిన అవసరం లేదని సదరు హోటల్ యాజమాన్యాలు కోర్టులో వాదించాయి. గతంలో ఇదే అంశంపై హైకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను కూడా తమ వాదనకు ఆధారంగా ఆ హోటల్ యాజమాన్యాలు చూపించాయి. అయితే.. ఈ పిటిషన్లను టీజీఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే డిమాండ్ నోటీసులపై గతంలో హైకోర్టులో కేసులు వేసి.. తర్వాత ఎలాంటి అనుమతి తీసుకోకుండా వాటిని ఉపసంహరించుకున్నారని గుర్తు చేశారు. ఆ తర్వాత బకాయిలను వాయిదాల్లో చెల్లించేందుకు విద్యుత్ సంస్థను ఆశ్రయించిన విషయాన్ని కూడా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాస్తవాలను పిటిషనర్లు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని గుర్తించిన హైకోర్టు.. హోటల్ యాజమాన్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజాలను వెల్లడించకుండా కోర్టును ఆశ్రయించడం న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టించడమేనని మండిపడింది. గతంలో ఉపసంహరించుకున్న పిటిషన్లపై మళ్లీ కొత్తగా రిట్ దాఖలు చేయడం కూడా చట్టపరంగా సమంజసం కాదని స్పష్టం చేసింది. రెండు హోటళ్లపై రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల జరిమానాను విధించింది. ఈ మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీకి చెల్లించాలని హైకోర్టు ఆ హోటల్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు పూర్తి వాస్తవాలతో, నిజాయితీతో హాజరుకావాలనే సందేశాన్ని ఈ తీర్పు బలంగా చాటిందని న్యాయవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

## కాంగ్రెసోళ్ల స్కూటీలు ఎత్తుకపోండ్రి

**బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి**

నిజామాబాద్, జూలై 17 (ఈవార్తలు): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు , ఎన్నికల హామీల అమలుపై రాజకీయ విమర్శలు మరింత వేడెక్కుతున్నాయి. నిజామాబాద్‌లో నిర్వహించిన ' ఇందూర్ రణభేరి ' కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేసిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి.. ఆ హామీ నెరవేర్చకపోతే కాంగ్రెస్ నాయకులకు చెందిన షోరూమ్‌ల నుంచి విద్యార్థినులు స్కూటీలు తీసుకెళ్లాలని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఆటలాడుతోందని విమర్శలు చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు బీజేపీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని.. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫైల్‌పైనే తొలి సంతకం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలపైనా కూడా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి స్పందించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు నిరాశ కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలు, సాగునీటి అంశాలపై కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## చచ్చినా దయ్యంగా తిరిగొస్తా: సోనమ్ వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: జులై 20 వరకు తాను బతికే ఉంటానని ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తెలిపారు. నీట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దాదాపు 20 రోజులకు పైగా సోనమ్ ఆమరణ నిరాహార దీక్ష చేన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజైన జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించతలపెట్టిన 'చలో సంసద్' మార్చ్ విజయవంతం అయ్యే వరకు తాను ఏదేమైనా సరే ప్రాణాలతోనే ఉంటానని, ఒకవేళ మార్చ్ విఫలమైతే దెయ్యం రూపంలోనైనా తిరిగి వస్తానని ఆయన స్పష్టం చేశారు. వాంగ్‌చుక్ నిరాహార దీక్ష నేపథ్యంలో ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఢిల్లీ హైకోర్ట్ గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వైద్య నివేదిక ప్రకారం అవసరమైన జోక్యం చేసుకోవాలని కోరింది. 'ప్రాణం విలువైంది' అని వ్యాఖ్యానించిన కోర్ట్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని రక్షించేందుకు సాధ్యమైన ప్రతి వైద్య ప్రయత్నాన్ని చేయాలని చెప్పింది. అయితే నిరంతర ఆందోళనల నేపథ్యంలో ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు రాజకీయ నాయకులు, ప్రముఖులు, న్యాయ సంస్థలు సోనమ్‌ను నిరాహార దీక్ష విరమించాలని కోరారు. కానీ ఆయన తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు. బరువు తగ్గిపోయినప్పటికి, తన దీక్షను విరమించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

## ఉద్యోగులకు 'డిజిటల్' హెల్త్

**న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం**

**ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి**


హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' (ఎన్‌ఈహెచ్‌ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, ఎన్‌ఈహెచ్‌ఎస్ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) ధరలకు

Page-4_Layout 1 7/18/2026 3:31 AM Page 1



"అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని భారతీయ సంస్కృతి వేల సంవత్సరాలుగా బోధిస్తోంది. అన్నదాతను దేవుడితో సమానంగా భావించిన దేశం మనది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహాదానంగా, భోజనాన్ని యజ్ఞంగా, రైతును జీవనాధారంగా గౌరవించిన సంప్రదాయం భారతదేశానిది. కానీ కాలం మారింది. వ్యవసాయం మారింది. పంటల ఉత్పత్తి విధానం మారింది. ఫలితంగా ఒకప్పుడు ఆరోగ్యాన్ని ప్రసాదించిన ఆహారమే ఇప్పుడు ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందనే ఆందోళన ప్రతి కుటుంబంలో వినిపిస్తోంది. ఒకప్పుడు పల్లెల్లో పండిన కూరగాయలకు సహజమైన రుచి ఉండేది.

పశువుల ఎరువు, పంటల మార్పిడి పద్ధతి, చెట్ల ఆకులు, పేడ, జీవామృతం వంటి ప్రకృతి సిద్ధమైన విధానాలతో సాగు జరిగేది. నేడు మాత్రం అధిక దిగుబడి, తక్కువ సమయంలో ఎక్కువ లాభం, మార్కెట్ పోటీ పేరుతో రసాయన ఎరువులు, పురుగుమందులు, పెరుగుదల హార్మోన్లు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఈ మార్పు రైతు ఆదాయాన్ని కొంత పెంచినా, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రతి ఉదయం మార్కెట్‌కు వెళ్లే వినియోగదారుడు కూరగాయల రంగు చూస్తాడు కానీ వాటిపై ఎంత రసాయనం ఉందో తెలుసుకోలేడు.



పండ్ల మెరుపు చూస్తాడు కానీ అవి సహజంగా పండాయా లేక రసాయనాలతో పండించారా అనేది గుర్తించలేడు. ఆకుకూరలు తాజాగా కనిపించినా, వాటిలోని విషపదార్థాలు కంటికి కనిపించవు. ఇదే నేటి అతిపెద్ద ప్రమాదం. ఇప్పటికే క్యాన్సర్, మధుమేహం, థైరాయిడ్, మూత్రపిండాల సమస్యలు, కాలేయ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలపై వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు.



వీటికి జీవనశైలి మార్పులతో పాటు ఆహారంలో పెరుగుతున్న రసాయనాల వినియోగం కూడా ఒక ప్రధాన కారణమని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో "సేంద్రియ వ్యవసాయం" లేదా "ఆర్గానిక్ వ్యవసాయం" ఇక ఒక ప్రత్యామ్నాయం కాదు. అది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే జాతీయ అవసరం. ఆర్గానిక్ పంటలు విలాసవంతులకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబానికి అందుబాటులోకి రావాలి.

అందుకు ప్రభుత్వం దృఢమైన విధానంతో ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఆర్గానిక్ రైతులు ఉన్నారు. వారి ఉత్పత్తులు కూడా పరిమితంగా ఉండటంతో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచే సేంద్రియ వ్యవసాయ విప్లవానికి శ్రీకారం చుట్టాలి. రైతులకు శిక్షణ, ప్రోత్సాహకాలు, మార్కెట్ హామీ, వినియోగదారులకు నమ్మకం.. ఈ నాలుగు స్తంభాలపై కొత్త వ్యవసాయ విధానం రూపుదిద్దుకోవాలి.

# అన్నమే విషం!



**ప్రతి మండలానికి ఆర్గానిక్ కేంద్రం.. ప్రభుత్వం ఏం చేయాలి?**

ప్రస్తుతం వ్యవసాయరంగం ఒక కీలక మలుపులో నిలిచింది. ఒకవైపు రైతు అధిక దిగుబడుల కోసం రసాయనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. మరోవైపు ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఆర్గానిక్ ఉత్పత్తులను వెతుకుతున్నారు. ఈ రెండింటి మధ్య వారధిగా నిలవాల్సింది ప్రభుత్వమే. రైతుకు భరోసా, వినియోగదారుడికి నమ్మకం కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిజంగా ప్రజారోగ్యాన్ని కాపాడాలనుకుంటే, ప్రతి మండలంలో "ఆర్గానిక్ వ్యవసాయ అభివృద్ధి కేంద్రం" ఏర్పాటు చేయాలి. ఇది కేవలం ఒక కార్యాలయం కాకుండా రైతులకు శిక్షణ, ఉత్పత్తి, నాణ్యత పరీక్ష, మార్కెటింగ్, నిల్వ, విక్రయాల వరకు అన్ని సేవలు అందించే సమగ్ర కేంద్రంగా ఉండాలి. ఈ కేంద్రాల్లో రైతులకు జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం, వర్మీ కంపోస్ట్, జీవ ఎరువులు, సహజ పురుగుమందుల తయారీపై ప్రత్యక్ష శిక్షణ ఇవ్వాలి. గ్రామాల్లో అందుబాటులో ఉండే గోమయం, గోమూత్రం, వేప, కానుగ, ఇతర ఔషధ మొక్కలతో తక్కువ ఖర్చులో సహజ వ్యవసాయం ఎలా చేయాలో నేర్పించాలి. ప్రతి రైతు పొలాన్ని ఒక ప్రయోగశాలగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేయాలి. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, గ్రామపంచాయతీలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓ లు), మహిళా సంఘాలను ఒకే వేదికపైకి తీసుకురావాలి. సమన్వయంతో పనిచేస్తే సేంద్రియ వ్యవసాయం వేగంగా విస్తరిస్తుంది. ప్రస్తుతం శాఖలు విడివిడిగా పనిచేస్తుండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. అత్యంత ముఖ్యంగా, ఆర్గానిక్ ఇన్‌పుట్ తయారీ పరిశ్రమలను ప్రతి మండలంలో స్థాపించాలి. గ్రామీణ యువత, మహిళా సంఘాలు, నిరుద్యోగులకు వీటి నిర్వహణ బాధ్యత అప్పగిస్తే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. జీవ ఎరువులు, సహజ పురుగుమందులు స్థానికంగానే తయారైతే రైతులకు తక్కువ ధరలో లభిస్తాయి. రసాయనాలపై ఆధారపడే పరిస్థితి కూడా క్రమంగా తగ్గుతుంది. రైతులు సేంద్రియ వ్యవసాయానికి మారే తొలి మూడు సంవత్సరాలు దిగుబడిలో కొంత మార్పు రావచ్చు. అందుకే ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక నిధిని ఏర్పాటు చేసి, ఎకరాకు ఆర్థిక సహాయం అందించాలి. పంట బీమా, కనీస మద్దతు ధర, ప్రత్యేక బోనస్ వంటి పథకాలు అమలు చేస్తే రైతులు ధైర్యంగా ఆర్గానిక్ వ్యవసాయాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు, ప్రతి జిల్లాలో అత్యాధునిక ఆర్గానిక్ నాణ్యత పరీక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. నిజమైన సేంద్రియ ఉత్పత్తులకు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం (సర్టిఫికేషన్) త్వరగా అందేలా సరళమైన విధానం తీసుకురావాలి. ప్రస్తుతం ధ్రువీకరణ ప్రక్రియ ఖరీదైనది, క్లిష్టమైనది కావడంతో చిన్న రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రతి మండల కేంద్రంలో వారానికి ఒకరోజు "ఆర్గానిక్ రైతు బజార్" నిర్వహించాలి. రైతు నుంచి నేరుగా వినియోగదారునికి ఉత్పత్తి చేరేలా మధ్యవర్తుల పాత్ర తగ్గించాలి. దీంతో రైతుకు మంచి ధర లభిస్తుంది. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు, ధాన్యాలు సరసమైన ధరలో అందుతాయి. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలు, గురుకులాలు వంటి ప్రభుత్వ సంస్థల్లో క్రమంగా ఆర్గానిక్ ఆహారాన్ని ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం పెద్ద కొనుగోలుదారుగా మారితే రైతులకు స్థిరమైన మార్కెట్ లభిస్తుంది. ఇదే ఆర్గానిక్ వ్యవసాయ విప్లవానికి బలమైన పునాది అవుతుంది. ప్రభుత్వం సంకల్పంతో ముందుకు వస్తే ప్రతి మండలం ఒక ఆర్గానిక్ హబ్‌గా మారుతుంది. రైతు ఆరోగ్యాన్ని కాపాడతాడు... ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తింటారు... తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది.

**రైతు, ప్రభుత్వం, ప్రజలు కలిస్తేనే!**

> రాష్ట్ర ప్రభుత్వం ఒక్కటే ఆర్గానిక్ వ్యవసాయాన్ని విజయవంతం చేయలదు. అలాగే రైతు ఒక్కడి ప్రయత్నం కూడా సరిపోదు. వినియోగదారులు ఆరోగ్యకరమైన ఆహారం కోరుకుంటూనే, తక్కువ ధరలకే కొనాలనే ఆలోచనలో ఉంటే మార్పు రావడం కష్టం. అందుకే ప్రభుత్వం, రైతు, రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, మహిళా సంఘాలు, యువత, వినియోగదారులు కలిసి ముందుకు సాగితేనే నిజమైన "ఆర్గానిక్ విప్లవం" సాధ్యమవుతుంది.

తెలంగాణలో ప్రతి గ్రామంలో రైతు వేదికలు, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల ద్వారా వ్యవసాయానికి ప్రభుత్వం ఇప్పటికే బలమైన మద్దతు ఇస్తోంది. ఇప్పుడు అదే స్థాయిలో "సేంద్రియ తెలంగాణ–ఆరోగ్య తెలంగాణ" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం వ్యవసాయ శాఖకే పరిమితం కాకుండా ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్, మహిళా అభివృద్ధి, పశుసంవర్ధక శాఖలు కలిసి అమలు చేసే ప్రజా ఉద్యమంగా మారాలి. ముఖ్యంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ( ఎఫ్ పిఓ లు) ఈ విప్లవానికి వెన్నెముక కావాలి. ఒక్కో రైతు విడిగా ఆర్గానిక్ ఉత్పత్తి చేస్తే మార్కెటింగ్ కష్టమవుతుంది. కానీ వందల మంది రైతులు ఒక సంఘంగా ఏర్పడి ఒకే ప్రమాణాలతో సాగు చేస్తే మార్కెట్‌లో నమ్మకం పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది. బ్రాండ్ విలువ పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో ప్రత్యేక "తెలంగాణ ఆర్గానిక్" బ్రాండ్‌ను అభివృద్ధి చేస్తే దేశవ్యాప్తంగా మంచి మార్కెట్‌ను సొంతం చేసుకోవచ్చు. మహిళా స్వయం సహాయక సంఘాలకు కూడా ఇందులో కీలక పాత్ర ఇవ్వాలి. జీవామృతం, ఘనజీవామృతం, వర్మీ కంపోస్ట్, వేప ఆధారిత సహజ పురుగుమందుల తయారీ యూనిట్లను మహిళా సంఘాలకు అప్పగిస్తే వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మహిళలు ఆరోగ్య ఉద్యమంలో భాగస్వాములు అవుతారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి రైతులకు నిరంతర సాంకేతిక సహాయం అందించాలి. ప్రయోగశాలల్లోనే కాకుండా పొలాల్లో కూడా పరిశోధనలు జరగాలి. ఒక గ్రామంలో విజయవంతమైన సేంద్రియ నమూనాను మరో గ్రామానికి విస్తరించే విధంగా కార్యాచరణ ఉండాలి. ఇంకా ఒక ముఖ్యమైన అంశం అవగాహన. నేడు చాలామందికి ఆర్గానిక్ అంటే ఏమిటో పూర్తిగా తెలియదు. కొందరు దాన్ని కేవలం ఖరీదైన వస్తువుగా భావిస్తున్నారు. ఈ అపోహలు తొలగించడానికి ప్రభుత్వం టెలివిజన్, రేడియో, సోషల్ మీడియా, పాఠశాలలు, గ్రామసభల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి కుటుంబం తన ఇంటి ఆవరణలో కనీసం కొన్ని ఆకుకూరలు, కూరగాయలు సేంద్రియ పద్ధతిలో పండించేలా ప్రోత్సహించాలి. నగరాల్లో రూఫ్‌టాప్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తే తాజా కూరగాయలు కుటుంబాలకు అందుతాయి. పిల్లల్లో ప్రకృతి పట్ల మమకారం పెరుగుతుంది. గ్రామాల్లో ప్రతి ఇంటి వెనుక కూరగాయల తోట, ప్రతి పాఠశాలలో పోషకాహార తోట, ప్రతి అంగన్‌వాడీలో ఆర్గానిక్ కూరగాయల తోట ఉంటే అది ఒక ఆరోగ్య విప్లవానికి నాంది అవుతుంది. అత్యంత ముఖ్యంగా వినియోగదారుడే మార్పుకు కేంద్రబిందువు. ప్రజలు రసాయన రహిత ఆహారాన్నే కోరితే రైతు కూడా ఆ దిశగా అడుగులు వేస్తాడు. నాణ్యమైన ఆహారం కోసం కొంత ఎక్కువ ధర చెల్లించడానికైనా సిద్ధపడితే, ఆర్గానిక్ వ్యవసాయం వేగంగా విస్తరిస్తుంది. ఎందుకంటే ఆరోగ్యానికి పెట్టే ఖర్చు, ఆసుపత్రులకు పెట్టే లక్షల రూపాయల ఖర్చు కంటే చాలా తక్కువ. ఆర్గానిక్ వ్యవసాయం అంటే కేవలం పంటల మార్పు కాదు. అది ఆరోగ్యాన్ని కాపాడే ఉద్యమం, పర్యావరణాన్ని రక్షించే బాధ్యత, భవిష్యత్ తరాలకు అందించే అమూల్యమైన వారసత్వం. ప్రభుత్వం దిశానిర్దేశం

> ప్రపంచం వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఎక్కువ దిగుబడే వ్యవసాయ విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు "ఎంత పండించాం?" అనే ప్రశ్న కంటే "ఏ నాణ్యతతో పండించాం?" అనే ప్రశ్నకే ఎక్కువ ప్రాధాన్యం పెరుగుతోంది. ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహనతో ప్రపంచంలోని అనేక దేశాలు రసాయనాల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అలాంటి సమయంలో వ్యవసాయంలో ముందంజలో ఉన్న తెలంగాణ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

చేస్తే, రైతు కష్టపడితే, ప్రజలు సహకరిస్తే తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా ఒక "ఆర్గానిక్ విప్లవం" ప్రారంభమవుతుంది. అదే నిజమైన అభివృద్ధి... అదే భవిష్యత్ భారతానికి ఆరోగ్య భరోసా.

**తెలంగాణ ఎందుకు ఆదర్శంగా మారకూడదు?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలు అమలులోకి వచ్చాయి. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టులు వంటి కార్యక్రమాలు వ్యవసాయానికి కొత్త ఊపునిచ్చాయి. ఇప్పుడు అదే దిశలో మరో చారిత్రక అడుగు వేస్తూ "తెలంగాణ ఆర్గానిక్ మిషన్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తే దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. ప్రతి జిల్లాలో కనీసం ఒక ఆర్గానిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి. ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ సేంద్రియ గ్రామం అభివృద్ధి చేయాలి. ప్రతి మండలంలో రైతులకు శిక్షణ కేంద్రం, జీవ ఎరువుల తయారీ యూనిట్, నాణ్యత పరీక్షా కేంద్రం, ప్రత్యేక ఆర్గానిక్ రైతు బజార్ ఏర్పాటు చేస్తే కొద్ది సంవత్సరాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఒక ఆరోగ్యకరమైన వ్యవసాయ వ్యవస్థ ఏర్పడుతుంది. ప్రభుత్వం రైతులకు కేవలం సబ్సిడీలు ఇవ్వడం మాత్రమే కాకుండా మార్కెట్ హామీ కూడా కల్పించాలి. ఆర్గానిక్ పద్ధతిలో పండించిన ధాన్యం, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలను ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేసి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులకు సరఫరా చేస్తే రైతుకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుంది. అలాగే "ఒక గ్రామం – ఒక ఆర్గానిక్ ఉత్పత్తి" అనే విధానాన్ని అమలు చేయవచ్చు. ఒక గ్రామం సేంద్రియ పసుపుకు, మరో గ్రామం మిరపకు, ఇంకొకటి కూరగాయలకు, మరొకటి పండ్లకు ప్రత్యేకత సాధించేలా ప్రణాళిక రూపొందిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. దీంతో తెలంగాణ ఉత్పత్తులకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ప్రస్తుతం యువత వ్యవసాయం వైపు ఆసక్తి తగ్గుతోంది. కానీ సేంద్రియ వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తే యువతకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. డ్రోన్లు, మట్టి పరీక్షలు, డిజిటల్ మార్కెటింగ్, ఈ–కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు విక్రయాలు, ఆర్గానిక్ బ్రాండింగ్ వంటి రంగాల్లో వేలాది ఉద్యోగాలు సృష్టించవచ్చు. వ్యవసాయం కేవలం సంప్రదాయ వృత్తి కాకుండా లాభదాయకమైన స్టార్టప్ రంగంగా మారుతుంది. ఇది కేవలం రైతు సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు. ప్రజారోగ్య కార్యక్రమం కూడా. రాష్ట్రంలో క్యాన్సర్, మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు తగ్గాలంటే చికిత్సపై మాత్రమే దృష్టి పెట్టడం సరిపోదు. వ్యాధులు రాకుండా చేసే ఆహార విధానాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహించాలి. "నివారణే ఉత్తమ వైద్యం" అనే సూత్రానికి సేంద్రియ వ్యవసాయమే బలమైన ఆధారం. రాష్ట్ర ప్రభుత్వం "ఆర్గానిక్ తెలంగాణ – ఆరోగ్య తెలంగాణ" అనే దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే అది కేవలం రైతులకే కాదు, ప్రతి కుటుంబానికి మేలు చేస్తుంది. భవిష్యత్ తరాలకు రసాయన రహిత ఆహారం అందించడం అంటే వారి ఆరోగ్యాన్ని, వారి భవిష్యత్తును కాపాడినట్లే. అభివృద్ధి అంటే కాంక్రీట్ భవనాలు మాత్రమే కాదు...



ఆరోగ్యవంతమైన ప్రజలు, విషరహిత ఆహారం, సారవంతమైన నేల, పరిశుభ్రమైన నీరు, పచ్చని ప్రకృతి కూడా. ఈ ఐదు అంశాలు కలిసే నిజమైన అభివృద్ధికి నిదర్శనం. ఆ దిశగా తెలంగాణ నడిస్తే దేశానికి మార్గదర్శక రాష్ట్రంగా నిలవడం ఖాయం.

(శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

అన్నం మనిషి జీవనానికి ఆధారం. రైతు పండించే ప్రతి గింజలో అతని చెమట ఉంటుంది. అదే గింజలో రసాయనాల మోతాదు పెరిగితే అది కేవలం రైతు సమస్య కాదు... సమాజం మొత్తానికి ఎదురయ్యే ఆరోగ్య సంక్షోభం. అందుకే ఆహార భద్రతతో పాటు ఆహార నాణ్యత కూడా ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా మారాలి. తెలంగాణ వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. ఇప్పుడు కాలానుగుణంగా మరో సంస్కరణకు సమయం వచ్చింది. అదే "ఆర్గానిక్ తెలంగాణ – ఆరోగ్య తెలంగాణ" ఉద్యమం. ఇది ఒక పథకం కాదు... రాబోయే తరాల ఆరోగ్యాన్ని కాపాడే మహాయజ్ఞం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా "తెలంగాణ ఆర్గానిక్ అథారిటీ" ని ఏర్పాటు చేసి, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, ఆరోగ్య, విద్య, మార్కెటింగ్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకురావాలి. ప్రతి మండలంలో ఆర్గానిక్ శిక్షణ కేంద్రాలు, జీవ ఎరువుల తయారీ యూనిట్లు, నాణ్యత పరీక్ష ప్రయోగశాలలు, రైతు బజార్లు, రైతులకు సలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దీనికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. అలాగే రసాయన ఎరువులు, పురుగుమందుల విక్రయంపై కఠిన నియంత్రణలు అమలు చేయాలి. మార్కెట్‌లో విక్రయించే కూరగాయలు, పండ్లు, ధాన్యాలపై క్రమం తప్పకుండా నాణ్యత పరీక్షలు నిర్వహించి, అధిక రసాయన అవశేషాలు ఉన్న ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి.

## అమృతాహారాన్ని కాపాడుకుందాం

ప్రజలకు ఆహార భద్రతపై విశ్వాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. రైతులు కూడా మార్పును స్వాగతించాలి. అధిక దిగుబడి మాత్రమే లక్ష్యం కాకుండా, నాణ్యమైన దిగుబడి లక్ష్యంగా పెట్టుకోవాలి. భూమి ఆరోగ్యాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలకు సారవంతమైన వ్యవసాయ భూమిని అందించగలం. భూమి అనేది కేవలం ఆస్తి కాదు... అది జీవనాధారం. ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. కూరగాయలు కొనేటప్పుడు కేవలం పరిమాణం, మెరుపు, ధర మాత్రమే కాకుండా వాటి నాణ్యత గురించి కూడా ఆలోచించాలి. ఇంటి వద్ద చిన్న కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలకు ప్రకృతి వ్యవసాయం విలువను తెలియజేయాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేయాలి. పర్యావరణ పరిరక్షణ, నేల సారాన్ని కాపాడటం, భూగర్భ జలాలను రక్షించడం, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రైతుల ఆదాయాన్ని పెంచడం.. ఈ ఐదు లక్ష్యాలను ఒకేసారి సాధించే శక్తి సేంద్రియ వ్యవసాయానికి ఉంది. అందుకే దీనిని ఒక ఉద్యమంగా తీసుకెళ్లాల్సిన సమయం వచ్చింది. ఈరోజు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రేపటి తెలంగాణ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. ఈరోజు రైతు వేసే విత్తనం రేపటి తరాలకు జీవనాధారంగా మారుతుంది. ఈరోజు ప్రజలు చేసే చైతన్యం రేపటి సమాజాన్ని ఆరోగ్యవంతంగా నిలబెడుతుంది.



## గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వెంటనే ఇవ్వాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి డిమాండ్**

జగిత్యాల రూరల్, జూలై 17 (ఈవార్తలు): గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు జలపతి విదేశాల్లో మృతి చెందడంతో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. జగిత్యాల ప్రాంతం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు. తాను పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రితో చర్చించి విదేశాల్లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయించినట్లు తెలిపారు. అయితే గత ఏడాది కాలంగా గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన సుమారు 200 మంది కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదని, చెక్కులు మంజూరైన వారికి కూడా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాల కొరత కారణంగా యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని వెంటనే బాధిత కుటుంబాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లచ్చన్న, రాజు, జలేందర్, రాంచంద్రం, మోహన్, బషీర్, శ్రీపాల్, సురేందర్, రాకేశ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## 14 మంది నిరాశ్రయులకు కొత్త జీవితం

**జగిత్యాల పోలీసుల మానవత్వం**

జగిత్యాల, జూలై 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనలతో జగిత్యాల పట్టణ పోలీసులు శుక్రవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. మతిస్థిమితం కోల్పోయి రోడ్లు, బస్టాండ్ పరిసరాల్లో సంచరిస్తున్న 14 మందిని రెస్క్యూ చేశారు. వారిపై మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్-2017 నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు స్నానాలు చేయించి, కొత్త దుస్తులు అందించారు. వైద్యుల సూచనల మేరకు వారిని హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ పి. కరుణాకర్ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వీధుల్లో సంచరిస్తున్న వారిని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన వైద్య సహాయం అందించడం పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు.



## వాల్మీకి ఆవాసంలో ఉచిత ఆరోగ్య శిబిరం

జగిత్యాల, జూలై 17 (ఈవార్తలు): సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగిత్యాల ధరూర్ క్యాంపులోని వాల్మీకి ఆవాసంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ గుండేటి అర్జున్, చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎనగందుల నరేష్, ఆవాసం పూర్వ విద్యార్థి, అనస్తీషియా నిపుణుడు డాక్టర్ నరేంద్ర, దంత వైద్య నిపుణుడు డాక్టర్ బాశెట్టి హర్షవర్ధన్, ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం బాధ్యులు డాక్టర్ ధనుంజయ, డాక్టర్ గోపాలచారి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు కొలిచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి ఆహారపు అలవాట్లు, ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించిన వైద్యులకు ఆవాస నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆవాస కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, సభ్యులు డాక్టర్ ధనుంజయ, అశోక్‌రావు, వెంకటేశ్వరరావు, ఆవాస ప్రముఖులు మల్లేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

**కవిత సమక్షంలో చేరిన జగిత్యాల నాయకులు**

హైదరాబాద్/జగిత్యాల, జూలై 17 (ఈవార్తలు): జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలువురు మాజీ సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి పునుగోటి పవన్ రావు నేతృత్వంలో వందలాది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయానికి తరలి వెళ్లారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగిత్యాలలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపిచ్చారు. నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియామకం అయిన పవన్ రావును అభినందించారు. తనకు ఇన్ ఛార్జిగా అవకాశం ఇచ్చిన పార్టీ చీఫ్ కవితను పవన్ రావు ఘనంగా సత్కరించారు.







# అటవీ భూములపై విజి'లెన్స్'

**కొడిమ్యాల రేంజ్‌లో భూముల పరిశీలన**

**సుమారు 25 ఎకరాలపై సర్వే**

**పహాణీలు, గ్రామ పటం ఆధారంగా నిర్ధారణ**

**చెట్ల నరికివేతపై ఆరోపణలు**

**బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం**

కొడిమ్యాల/జగిత్యాల బ్యూరో, జూలై 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం శనివారంపేట పరిధిలోని అటవీ భూములపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. అటవీ భూముల ఆక్రమణలు, చెట్ల నరికివేతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో డీఎఫ్‌వో విజిలెన్స్ అధికారి సీహెచ్ శివయ్య ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. శనివారంపేట బ్లాక్--1, బ్లాక్--2 మధ్య ఉన్న అటవీ భూములను విజిలెన్స్ బృందం పరిశీలించింది. సుమారు 25 ఎకరాల భూమిని సర్వే చేసి ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. పట్టా భూములంటూ కొందరు టేకు చెట్లను నరికివేసి సాగు చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు వివరాలు సేకరించారు. స్థానిక అటవీ అధికారుల సహకారంతో చెట్ల నరికివేత జరిగిందా? అనే కోణంలోనూ విచారణ సాగుతున్నట్లు తెలిసింది. భూములపై తుది నిర్ధారణకు గ్రామ పటం, పహాణీ తదితర రెవెన్యూ రికార్డులను పరిశీలించనున్నారు. అటవీ భూముల సరిహద్దులు, చెట్ల నరికివేతకు సంబంధించిన వివరాలను అధికారులు నమోదు చేశారు. ట్రీ డ్యామేజ్‌కు పాల్పడిన వారికి నిబంధనల ప్రకారం జరిమానా విధించినట్లు డీఎఫ్‌వో విజిలెన్స్ అధికారి సీహెచ్ శివయ్య తెలిపారు. కొడిమ్యాల రేంజ్, తిర్మలాపూర్ బీట్ పరిధిలో సుమారు 40 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదులు గతంలో ఉన్నట్లు సమాచారం. ఈ భూమి విలువ సుమారు రూ.8 కోట్లు ఉంటుందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పెంచిన చెట్లు, చెక్‌డ్యామ్ ఉన్న ప్రాంతంలో చెట్ల నరికివేత, భూమి వినియోగంపై కూడా ఆరోపణలు వచ్చాయి. అటవీ భూముల ఆక్రమణల వెనుక ఓ రియల్టర్ పాత్ర ఉందన్న ఆరోపణలతో పాటు, కొందరు అటవీ అధికారుల సహకారం ఉందన్న ఫిర్యాదులు కూడా ఉన్నట్లు తెలిసింది. గతంలో ఈ అంశంపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలపైనా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. కొడిమ్యాల రేంజ్‌కు సంబంధించిన ఓ అధికారి గతంలో ఏసీబీ కేసులో చిక్కిన నేపథ్యంలో, అటవీ భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలకు ప్రాధాన్యం ఏర్పడింది. జిల్లా అటవీశాఖలోని కొందరు అధికారులపై వచ్చిన ఆరోపణలపై కూడా ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే హైదరాబాద్ నుంచి విజిలెన్స్ బృందాలు వచ్చి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. భూముల కొలతలు, చెట్ల నరికివేత, రికార్డుల పరిశీలన అనంతరం పూర్తి నివేదిక సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అటవీ భూముల ఆక్రమణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అటవీ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేసిన తనకు ఫారెస్ట్ మాఫియా నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదుదారు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ అంశంపైనా అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. అటవీ భూముల పరిరక్షణలో అధికారులు విఫలమయ్యారా? రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలకు సంబంధం ఉందా? అనే కోణాల్లోనూ విచారణ కొనసాగుతోంది.






## తెలంగాణ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న యోనెక్స్--సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ (అండర్-15) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 శుక్రవారం మణికొండలోని మ్యాచ్ పాయింట్ ప్రైడ్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. భారత జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ డాక్టర్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావంతో సాధన చేస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి మ్యాచ్‌ను ఒక కొత్త అనుభవంగా భావించి ఆత్మవిశ్వాసంతో ఆడాలని, ఓటములను పాఠాలుగా మలుచుకుని ముందుకు సాగాలని యువ క్రీడాకారులకు సూచించారు.తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జి. వెంకట్‌రావు పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అండర్-15 బాలబాలికలు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీపడుతున్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ పోటీలు భవిష్యత్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సలహాదారు కొసరాజు లక్ష్మణ్, కోశాధికారి కానూరి వంశీధర్, సంయుక్త కార్యదర్శులు యూవీఎన్ బాబు, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సామా ప్రభాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఆర్. శ్రీనివాస్, జయంత్, శ్రీకాంత్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ ఏ.వి. రమణారెడ్డి, కామారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సందీప్, మ్యాచ్ పాయింట్ ప్రైడ్ అధినేత ముప్పాళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్ విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు.

## 'సర్'లో బిజీగా భోగ శ్రావణి



జగిత్యాల టౌన్, జూలై 17 (ఈవార్తలు): పట్టణంలోని 42వ వార్డులో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) అమలు తీరును బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి, వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని అన్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చి స్థిరపడిన కార్మికులు, ఉద్యోగులు అధికంగా ఉన్నారని, వీరిలో చాలామంది ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం 5 గంటల తర్వాతే ఇళ్లకు చేరుకుంటారని తెలిపారు. అందువల్ల బి ఎల్ ఓ లు సాయంత్రం వేళల్లోనూ అందుబాటులో ఉండి ఓటర్లను కలిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్రోల్మెంట్ ఫారాల మ్యాపింగ్, నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చాలని సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, రాజకీయ పార్టీలు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల సంఘానికి సహకరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్, సిరిపురం శ్రీలత శ్రీనివాస్, అముద రాజు, గదాసు రాజేందర్, గట్ల శ్రీనివాస్, బద్దెల గంగరాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలోనూ రాణించాలి

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్.. కళాశాలల అభివృద్ధికి రూ.2.16 కోట్ల ప్రతిపాదనలు**



జగిత్యాల, జూలై 17 (ఈవార్తలు): విద్యార్థులు విద్యాభ్యాసంతోపాటు సామాజిక కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పండ్ల మొక్కలు నాటడం, జల ప్రతిజ్ఞ, హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వ్యాసరచన పోటీల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇస్కా ఫౌండేషన్, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్, ఏపీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. బాలికల, బాలుర జూనియర్ కళాశాలల అభివృద్ధికి సుమారు రూ.2.16 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వ్యాసరచన పోటీల్లో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, కౌన్సిలర్లు అరవ లక్ష్మీరాజు, మమత రామకృష్ణారెడ్డి, కూతురు శేఖర్, కార్యక్రమ నిర్వాహకులు, ఇస్కా ఫౌండేషన్ నిర్వాహకులు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీవీ సూర్యం, త్రివేణి సాగర్, ఏంటోను ముత్తు, పాల్తేపు భూమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, మాజీ ఆర్టీఏ సభ్యులు సుధాకర్‌రావు, గంగరాజం, శరత్‌రావు, రహీం, నాయకులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు దేవస్థానంలో 6 పోస్టుల భర్తీ

మల్యాల, జూలై 17 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న అర్చక, డోలు, సన్నాయి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. మే 18న నిర్వహించిన అర్హత పరీక్ష ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి విడుదల చేశారు. మొత్తం ఆరు పోస్టులను భర్తీ చేయగా.. నాలుగు అర్చక, ఒక డోలు, ఒక సన్నాయి పోస్టులు ఉన్నాయి. అర్చక పోస్టులకు తిరునహరి ఆకాష్ మనోజ్, వకుళాభరణం అరుణ్‌కుమార్, ఆశ్రిత్ తిరుక్కోవెల, తిరుక్కోవెల అజయ్‌ప్రసాద్ ఎంపికయ్యారు. డోలు పోస్టుకు మంగలి సుదర్శన్‌బాబు, సన్నాయి పోస్టుకు తిరుమల వెంకట అశోక్ ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హన్మంతరావు, ఐఏఎస్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు దేవస్థానం ఈఓ ఎస్. అంజనారెడ్డి, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన

వేములవాడ అర్బన్, జూలై 17 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి సీహెచ్. సాయిలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలను ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) ద్వారా వివరించారు. అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి, మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలి, రోగులు, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో భయాందోళనకు గురికాకుండా వెంటనే 101కు ఫోన్ చేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కె. వెంకటేశం, దుర్గరాజ్, సాబీర్, శేఖర్, ఉపేందర్, భాస్కర్, షాదుల్లాతో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయానికి 21 పోస్టులు



వేములవాడ అర్బన్, జూలై 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ చరిత్రలో తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా 191 పోస్టులను భర్తీ చేస్తూ ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి ప్రత్యేక చొరవతో ఈ నియామక ప్రక్రియ పూర్తయింది. నియామక పత్రాల ప్రదాన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి, సీత డైరెక్టర్ డాక్టర్ విజయ రాఘవాచార్యులు పాల్గొని అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఇందులో వేములవాడకు 21 పోస్టులు కేటాయించారు. వీటిలో 11 పరిచారకులు, ఇద్దరు వైష్ణవ అర్చకులు, ఇద్దరు తమ్మల అర్చకులు, ఒక అసిస్టెంట్ కుక్, ఒక శృతి వాద్యకారుడు, ఇద్దరు డోలు వాద్యకారులు, ఇద్దరు సన్నాయి వాద్యకారులు ఉన్నారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత దేవాదాయ శాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం విశేషమని అధికారులు తెలిపారు. ఆలయాల్లో సిబ్బంది కొరతను అధిగమించడం, అర్చక వ్యవస్థను బలోపేతం చేయడం, సాంప్రదాయ వాద్య కళాకారులకు ప్రోత్సాహం అందించడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన అభ్యర్థుల కోసం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రత్యేక బస్సులు, భోజన వసతి సహా అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి ఎంపికైన అభ్యర్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం దేవస్థానం తరపున హాజరైన ఉన్నతాధికారులకు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి సత్కరించారు. హిందూ దేవాలయాల అభివృద్ధి, ధార్మిక సేవల విస్తరణ, ఆలయ సంప్రదాయాల పరిరక్షణకు ఈ నియామకాలు మైలురాయిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శనివారం 18-7-2026, జగిత్యాల | www.evarthalu.com | 6

వయ్యారి చిత్రం


సీరత్ కపూర్



## జానీ మాస్టర్‌పై ఫెడరేషన్ బ్యాన్



ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై తెలుగు చలనచిత్ర కార్మిక సమాఖ్య (ఫెడరేషన్) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయనపై దేశవ్యాప్త బహిష్కరణ విధిస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. జూలై 12న జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన సమాఖ్య ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఫెడరేషన్ పేర్కొంది. ఈ అంశంపై వివరణ ఇచ్చేందుకు జూలై 14న విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ ఆయన గైర్హాజరైనట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, ఏడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో స్పష్టం చేసింది. ఆదేశాలను బేఖాతరు చేస్తే మరిన్ని కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. సమాఖ్య తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జానీ మాస్టర్ పనిచేసే ఏ చిత్రానికైనా, ఏ భాష చిత్ర పరిశ్రమలోనైనా కార్మికులు సహకరించబోరని ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఈ పరిణామం ఆయన వృత్తిగత కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి హోదాలో ఉన్న జానీ మాస్టర్ భార్య సుమలత వ్యవహారశైలిపై కూడా ఫెడరేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

## యూనియన్‌లో ఫెడరేషన్ జోక్యమేంటి?

**ఉపఎన్నికకు సిద్ధమైన టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్**

టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది. ఫెడరేషన్ జోక్యాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేసిన అసోసియేషన్, ఖాళీ అయిన పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సభ్యుల డిమాండ్ మేరకు ఉప ఎన్నికలకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను జులై 20న నామినేషన్లు దాఖలు స్వీకరించడంతో ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఎన్నికల అధికారి అదే రోజు నుంచి నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపింది. జులై 22 వరకు నామినేషన్ల ఉపసంహారణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారమే ఈ ఎలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్‌లో ఇటీవల జరిగిన వివాదం నేపథ్యంలో 10 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురు కూడా ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది.

## హాట్‌స్టార్‌లోకి వచ్చేసిన 'మా ఇంటి బంగారం'

స్టార్ హీరోయిన్ సమంత సుమారు మూడేళ్ల విరామం తర్వాత 'మా ఇంటి బంగారం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు ఓటీటీ వేదికపైకి వచ్చేసింది. హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి తెలుగు సినిమాగా చరిత్ర సృష్టించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ఇప్పుడు డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జియో హాట్‌స్టార్' దక్కించుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేశారు. దీంతో దక్షిణాది సినీ ప్రియులు ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోనూ అదే ఆదరణ పొందుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.




## టాలీవుడ్ సూపర్



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వదుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## లారెన్స్ సినిమాలో జాన్వీ, సాయిపల్లవి, రుక్మిణి, కయాదు

నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 30వ సినిమాకు సిద్ధమవుతున్నారు. 'రా-30' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా ప్రారంభం కాకముందే దీని క్యాస్టింగ్ సంచలనంగా మారింది. ఈ చిత్రంలో ఒకరు కాదు, ఏకంగా నలుగురు ప్రముఖ హీరోయిన్లు నటించనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ భారీ చిత్రంలో సాయి పల్లవి, జాన్వీ కపూర్, రుక్మిణి వసంత్, కయాదు లోహార్ కీలక పాత్రలు పోషించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నలుగురు నటీమణులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా సౌత్ ఇండియన్ సినిమాలో ఇది చర్చనీయాంశం అయింది. దాంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఈ చిత్రాన్ని రాఘవ లారెన్స్ తన సొంత నిర్మాణ సంస్థ 'రాఘవేంద్ర ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం.

## మన తిండి సురక్షితమా?


టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు. ఈ క్రమంలో, కాజల్ 'మీ ప్లేట్ లో ఏముంది' అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతను కూడా పాల్గొనాలని సవాల్ విసిరింది. నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు. ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్‌ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా వ్యవహరించాయి. సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు, నిర్మాతగానూ వ్యవహరించారు. ఈ చిత్రం జూలై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.





## సోనమ్ వాంగ్ చుక్ ఎవరో తెల్వదు: ఆమిర్ ఖాన్

బాలీవుడ్ అగ్ర నటుడు ఆమిర్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. 2009లో సంచలన విజయం సాధించిన '3 ఇడియట్స్' చిత్ర నిర్మాణం జరిగే సమయానికి తనకు లఢఖ్ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఎవరో తెలియదని ఆయన ఇటీవల పేర్కొనడం వివాదాస్పదమైంది. వాస్తవానికి, ఈ చిత్రంలోని 'ఫున్‌సుఖ్ వాంగ్డూ' (రాంచో) పాత్రకు సోనమ్ వాంగ్‌చుకే ప్రధాన స్ఫూర్తి అని చాలాకాలంగా ప్రచారంలో ఉంది. ఇటీవల లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆమిర్ ఖాన్ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. "అదొక అపోహ మాత్రమే, వాస్తవం కాదు. '3 ఇడియట్స్' సినిమా చేస్తున్న సమయంలో నాకు గానీ, రచయితలు రాజ్‌కుమార్ హిరానీ, అభిజత్ జోషీలకు గానీ సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదు" అని ఆయన స్పష్టం చేశారు.



## వ్యాపారంలోనూ

# మెస్సీ కింగే!

లియోనెల్ మెస్సీ.. ఈ పేరుకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఫుట్‌బాల్ మైదానంలో తన అద్వితీయమైన ఆటతీరుతో లెక్కలేనన్ని రికార్డులు బద్దలు కొట్టి, కోట్లాది మంది అభిమానుల గుండెల్లో 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్)గా నిలిచాడు. అయితే, ఫుట్‌బాల్ ప్రపంచానికి రారాజుగా వెలుగొందుతున్న మెస్సీకి మరో కోణం కూడా ఉంది. అదే.. లగ్జరీ హాస్పిటాలిటీ రంగంలో విజయవంతమైన వ్యాపారవేత్తగా రాణించడం. ఆటలో ఎలా గోల్స్ కొడతాడో, వ్యాపారంలోనూ అంతే పెద్ద విజయాలు సాధించగలడని మెస్సీ నిరూపిస్తున్నాడు. ఫుట్‌బాల్‌కు దూరంగా, మెస్సీ 'ఎంఐఎం హోటల్స్' పేరుతో ఒక లగ్జరీ బొటిక్ హోటల్స్ చైన్‌ను నిర్మించాడు. స్పెయిన్, అండోర్రా వ్యాప్తంగా ఆరు అత్యంత విలాసవంతమైన హోటళ్లు ఈ బ్రాండ్ కింద ఉన్నాయి. బార్సిలోనా సమీపంలోని సిట్జెస్, ఇబిజా, మల్లోర్కా, పైరినీస్ పర్వతాల్లోని బకేరా, అండోర్రా, అండలూసియాలోని సోటోగ్రాండే వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఈ హోటళ్లు కొలువుదీరాయి. ఒక్కో హోటల్ ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంది. సముద్ర తీర అందాలను ఆస్వాదించాలనుకునే వారికి, పర్వత ప్రాంతాల్లో స్కీయింగ్ చేయాలనుకునే వారికి, ప్రశాంతమైన వాతావరణంలో సేద తీరాలనుకునే వారికి అనుగుణంగా ఈ హోటళ్లను తీర్చిదిద్దారు. ఈ హోటళ్లలో మెస్సీ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకునేలా అనేక ప్రత్యేకతలు ఇక్కడ ఉన్నాయి. కొన్ని హోటళ్లలో 'లియో మెస్సీ సూట్స్' పేరుతో ప్రత్యేక గదులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా మెస్సీ గెలుచుకున్న ప్రఖ్యాత బాలోన్ డి'ఓర్ ట్రోఫీల రెప్లికాలను కూడా ప్రదర్శనకు ఉంచారు. దీంతో ఈ హోటళ్లు కేవలం లగ్జరీ ప్రయాణికులకే కాకుండా మెస్సీ అభిమానులకు కూడా ఒక యాత్రా స్థలంగా మారాయి. రాత్రి బసకు సుమారు 600 యూరోలు (సుమారు రూ. 66,000) వరకు చార్జ్ చేసే ఈ హోటళ్లలో అత్యాధునిక వెల్‌నెస్ సౌకర్యాలు, ప్రైవేట్ రూఫ్‌టాప్ జాకుజీలు కూడా ఉన్నాయి.

# ఫిఫా ఫైనల్‌కు ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిష్ఠాత్మక ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు హాజరుకానున్నారు. న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఎల్లుండి జరగనున్న ఈ ఫైనల్ పోరులో విజేతగా నిలిచిన జట్టుకు, ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినోతో కలిసి ట్రంప్ ట్రోఫీని ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని వైట్ హౌస్, ఫిఫా వర్గాలు ధ్రువీకరించాయి. స్పెయిన్, అర్జెంటీనా మధ్య జరగనున్న ఈ తుది పోరుకు ట్రంప్ హాజరు కానుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ.. "ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించడంలో అమెరికా సత్తాను ఈ టోర్నమెంట్ చాటి చెప్పింది. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం అధ్యక్షుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని ఆమె తెలిపారు.




అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిస్తున్నప్పటికీ, ట్రంప్ ఇప్పటివరకు ఏ మ్యాచ్‌కు హాజరుకాలేదు. ఫైనల్‌కు ఆయన రాక ఖరారు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అతిథ్య దేశాధినేత, ఫిఫా అధ్యక్షుడితో కలిసి ట్రోఫీని అందించడం ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమని ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో తెలిపారు. "గతంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాం. 2022లో ఖతార్ ఎమిర్, 2018లో రష్యా అధ్యక్షుడు కూడా ట్రోఫీ ప్రదానంలో పాల్గొన్నారు. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తాం" అని ఆయన స్విస్ మీడియాతో అన్నారు. ట్రంప్, ఇన్ఫాంటినో మధ్య చాలాకాలంగా మంచి సంబంధాలు ఉన్నాయి. 2025 డిసెంబర్‌లో జరిగిన టోర్నమెంట్ డ్రా సందర్భంగా ట్రంప్ ఫిఫా తొలి శాంతి బహుమతిని అందుకున్నారు. గత వేసవిలో ఇదే మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగిన క్లబ్ వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా ట్రంప్ ట్రోఫీని అందించారు.

## క్రికెట్ దిగ్గజం

# గ్యారీ సోబర్స్ కన్నుమూత





**క్రికెట్ ప్రపంచంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. క్రీడా చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా ప్రపంచవ్యాప్తంగా కీర్తి పొందిన వెస్టిండీస్ దిగ్గజం సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ (గ్యారీ) కన్నుమూశాడు. ఆయన వయసు 89 సంవత్సరాలు. ఆయన మరణంతో క్రికెట్ క్రీడలో ఒక శకం ముగిసినట్లయింది. బ్యాట్‌తోనూ, బంతితోనూ అద్భుతాలు సృష్టించి, ఆల్‌రౌండర్ అనే పదానికి అసలైన నిర్వచనంగా నిలిచిన సోబర్స్, తన వెనుక చెరగని వారసత్వాన్ని విడిచి వెళ్లాడు.**

ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన తొలి ఫస్ట్-క్లాస్ క్రికెటర్‌గా సోబర్స్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. 1968లో స్వాన్సీలోని సెయింట్ హెలెన్స్ మైదానంలో ఈ అరుదైన ఘనతను సాధించాడు. నాటింగ్‌హామ్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ, గ్లామోర్గాన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఆయన ఈ రికార్డు సృష్టించాడు. క్రికెట్ అభిమానుల హృదయాల్లో ఈ ఘట్టం ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. బార్బడోస్‌లో జన్మించిన సోబర్స్, తన అసాధారణ ప్రతిభతో అతి చిన్న వయసులోనే క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. కేవలం 16 ఏళ్ల వయసులోనే 1953లో ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాతి ఏడాదే వెస్టిండీస్ టెస్ట్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 1958లో పాకిస్థాన్‌పై జరిగిన టెస్టులో అజేయంగా 365 పరుగులు చేసి, అప్పటి టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ రికార్డును 1994లో విండీస్ మరో దిగ్గజం బ్రియాన్ లారా అధిగమించే వరకు పదిలంగా నిలిచింది. సోబర్స్ తన 38వ ఏట 1974లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సోబర్స్ ఆటలోని అన్ని విభాగాల్లోనూ చూపిన ప్రతిభ కారణంగా, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఎనలేని ప్రజాదరణ ఉండేది. తన అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌లో సోబర్స్ 93 టెస్టులు ఆడి, 57.78 సగటుతో 8,032 పరుగులు చేశాడు. అలాగే, 34.03 సగటుతో 235 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో 5,000కు పైగా పరుగులు చేసిన ఆటగాళ్లలో ఇప్పటికీ నాలుగో అత్యధిక బ్యాటింగ్ సగటు ఆయనదే కావడం విశేషం. ఆయన ఫస్ట్-క్లాస్ రికార్డు కూడా అంతే అద్భుతంగా ఉంది. మొత్తం 383 మ్యాచ్‌లలో 28,000కు పైగా పరుగులు చేసి, 1,000కు పైగా వికెట్లు తీశాడు. బార్బడోస్, నాటింగ్‌హామ్‌షైర్, సౌత్ ఆస్ట్రేలియా జట్లకు ఆయన ప్రాతినిధ్యం వహించాడు. క్రికెట్‌కు ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, 1975లో సోబర్స్‌ను 'సర్' బిరుదుతో సత్కరించారు. ఆయన ప్రభావం తరతరాలుగా క్రికెటర్లపై కొనసాగుతూనే ఉంది. కేవలం గొప్ప ఆటగాడిగానే కాకుండా, భవిష్యత్ ఆల్‌రౌండర్లను అంచనా వేయడానికి ఒక కొలమానంగా సోబర్స్ ఎప్పటికీ గుర్తుండిపోతాడు.

## వరల్డ్ కప్ ఫైనల్‌కు

# రెఫరీగా విన్సిచ్

2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు.



ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆంద్రాజ్ కోవాసిచ్ (ఇద్దరూ స్లోవేనియాకు చెందినవారే) వ్యవహరించనున్నారు. స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి. అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు.

# మూడో వన్డేకు సుందర్ దూరం

ఇంగ్లండ్‌తో జరగనున్న నిర్ణయాత్మక మూడో వన్డేకు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) కారణంగా చివరి వన్డే మ్యాచ్‌కు దూరమయ్యాడు. లార్డ్స్ వేదికగా ఆదివారం జరగనున్న ఈ మ్యాచ్‌కు సుందర్ అందుబాటులో ఉండడని జట్టు వర్గాలు స్పష్టం చేశాయి.



గురువారం కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఈ గాయమైంది. 33వ ఓవర్లో పరుగు పూర్తిచేసే క్రమంలో సుందర్ గాయపడ్డాడు. వెంటనే ఫిజియో కమలేష్ జైన్ మైదానంలోకి వచ్చి ప్రథమ చికిత్స చేసి, తొడకు భారీగా స్ట్రాపింగ్ కట్టారు. అయితే, ఆ తర్వాతి బంతికే పేసర్ సాకిబ్ మహమూద్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ బట్లర్‌కు క్యాచ్ ఇచ్చి సుందర్ (2) ఔటయ్యాడు. ఆ తర్వాత ఫీల్డింగ్‌కు కూడా రాలేదు. అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ సబ్‌స్టిట్యూట్‌గా ఫీల్డింగ్ చేశాడు. "పరుగు కోసం ప్రయత్నిస్తున్నప్పుడే సుందర్ గాయపడ్డాడు. అతని హ్యామ్‌స్ట్రింగ్ గాయం తీవ్రంగానే కనిపిస్తోంది" అని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ మ్యాచ్ అనంతరం తెలిపారు. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమంగా ఉంది. సుందర్ గాయం నుంచి కోలుకోవడానికి కొన్ని వారాలు పట్టే అవకాశం ఉండటంతో, అతని స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. తొలి వన్డేలో అజేయంగా 52 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన సుందర్ లేకపోవడం జట్టుకు పెద్ద లోటు.



## ఫిఫా విజేతలకు

# ఉంగరాలు

ఫిఫా ప్రపంచకప్-2026 విజేత జట్టుకు ఈసారి సరికొత్త గౌరవం దక్కనుంది. ప్రపంచకప్ చరిత్రలోనే తొలిసారిగా ఛాంపియన్ జట్టుకు ట్రోఫీ, స్వర్ణ పతకాలతో పాటు ప్రత్యేక 'ఛాంపియన్‌షిప్ రింగ్స్' అందజేయనున్నట్లు ఫిఫా ప్రకటించింది. అమెరికా క్రీడల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ సంప్రదాయాన్ని తొలిసారిగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ప్రవేశపెడుతున్నారు. ఫైనల్ ముగిసిన వెంటనే విజేత జట్టు కెప్టెన్, ప్రధాన కోచ్‌కు తాత్కాలిక రింగ్స్‌ను అందజేస్తారు. అనంతరం జట్టు సభ్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 30 రింగ్స్‌ను అధికారికంగా బహూకరిస్తారు. ప్రతి రింగ్‌పై ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ చిత్రంతో పాటు విజేత జట్టు ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబించే ప్రత్యేక డిజైన్ ఉంటుంది. అంతేకాకుండా, ప్రతి ఉంగరానికి ఒక ప్రత్యేక నంబర్, ప్రామాణికతను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను కూడా అందిస్తారు. మొత్తం 2,026 రింగ్స్‌ను మాత్రమే తయారు చేయనున్నారు. వీటిలో 30 రింగ్స్‌ను విజేత జట్టుకు కేటాయిస్తారు.




మిగిలిన 1,996 రింగ్స్‌ను అధికారిక లైసెన్స్‌డ్ ఉత్పత్తులుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇలా అభిమానులు కూడా ప్రపంచకప్ అరుదైన జ్ఞాపకాన్ని సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఫిఫా తెలిపింది. కాగా, 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో యూరప్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌ను ఓడించి స్పెయిన్ ఫైనల్‌కు చేరగా, అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# నిజాన్ని మింగేస్తున్న నకిలీ ప్రపంచం

"చూస్తే నమ్మాలి" అనే మాట ఒకప్పుడు నిజం. ఇప్పుడు "చూసినా నమ్మకూడదు" అనే పరిస్థితి వచ్చింది. కారణం ఒక్కటే.. డీప్‌ఫేక్ టెక్నాలజీ. కృత్రిమ మేధ ఆధారంగా రూపొందిస్తున్న ఈ సాంకేతికతతో ఒక వ్యక్తి మాట్లాడని మాటలను మాట్లాడినట్లు, చేయని పనులను చేసినట్లు, ఎప్పుడూ లేని సంఘటనలను జరిగినట్లు అత్యంత సహజంగా చూపించడం సాధ్యమవుతోంది. ఒకప్పుడు సినిమా గ్రాఫిక్స్‌కే పరిమితమైన ఈ సాంకేతికత ఇప్పుడు సాధారణ మొబైల్ ఫోన్, కంప్యూటర్ ఉన్న వారికీ అందుబాటులోకి వచ్చింది. సాంకేతికత అభివృద్ధి మానవాళికి వరమే. కానీ ప్రతి వరం బాధ్యత లేకపోతే శాపంగా మారుతుంది. డీప్‌ఫేక్‌లు కూడా అదే దారిలో పయనిస్తున్నాయి. ఒక వ్యక్తి ముఖాన్ని మరో వ్యక్తి వీడియోపై అతికించడం, స్వరాన్ని యథాతథంగా అనుకరించడం, కృత్రిమంగా వీడియోలు తయారు చేయడం ఇప్పుడు కొన్ని నిమిషాల వ్యవహారంగా మారింది. ఫలితంగా నిజాన్ని గుర్తించడం సాధారణ పౌరుడికి రోజురోజుకూ కష్టమవుతోంది.

ఈ సమస్య వ్యక్తిగత స్థాయిలో మొదలై జాతీయ భద్రత వరకు విస్తరించింది. మహిళల ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకర వీడియోలు తయారు చేయడం, ప్రముఖుల పేరుతో నకిలీ ప్రకటనలు రూపొందించడం, వ్యాపారవేత్తల స్వరాన్ని అనుకరించి ఆర్థిక మోసాలకు పాల్పడడం, ప్రభుత్వ అధికారుల పేరుతో తప్పుడు సందేశాలు పంపించడం వంటి ఘటనలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ప్రత్యేకించి ఎన్నికల సమయంలో డీప్‌ఫేక్‌లు ప్రజాస్వామ్యానికి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఒక నాయకుడు చెప్పని మాటలను చెప్పినట్లు వీడియో విడుదల చేస్తే, అది కొన్ని గంటల్లోనే లక్షలాది మందికి చేరుతుంది. ఆ తర్వాత అది నకిలీ అని తేలినా, అప్పటికే నష్టం జరిగిపోయి ఉంటుంది. ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి, ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి, సామాజిక ఉద్రిక్తతలు సృష్టించడానికి డీప్‌ఫేక్‌లు ప్రమాదకర ఆయుధంగా మారే అవకాశం ఉంది. ఇక్కడ అసలు సమస్య సాంకేతికత కాదు; దాని దుర్వినియోగం. కత్తితో శస్త్రచికిత్స కూడా చేయొచ్చు, నేరం కూడా చేయొచ్చు. అలాగే ఏఐతో వైద్య పరిశోధనలు, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చెందొచ్చు. అదే ఏఐతో అబద్ధాలను కూడా నిజంలా చూపించొచ్చు. అందుకే సాంకేతికతను వ్యతిరేకించడం కాదు, దానికి సరైన నియంత్రణలు, నైతిక ప్రమాణాలు ఏర్పరచడం అవసరం. భారత్ వంటి అతిపెద్ద డిజిటల్ ప్రజాస్వామ్యానికి ఈ సమస్య మరింత కీలకం. కోట్లాది మంది సోషల్ మీడియాను ప్రధాన సమాచార వనరుగా ఉపయోగిస్తున్నారు. వైరల్ అయిన వీడియో నిజమా కాదా అని పరిశీలించే అలవాటు అందరిలో ఉండదు. భావోద్వేగాలను రెచ్చగొట్టే కంటెంట్ వేగంగా వ్యాపిస్తుంది.

ఈ పరిస్థితిని దురుద్దేశపూర్వక శక్తులు సులభంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. అందుకే డిజిటల్ అక్షరాస్యత ఇప్పుడు అత్యంత అవసరం. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు డిజిటల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించాలి. ఒక వీడియో చూసిన వెంటనే నమ్మకుండా, దాని మూలం ఏమిటి? విశ్వసనీయ వార్తా సంస్థలు ప్రచురించాయా? అధికారిక ప్రకటన ఉందా? వంటి ప్రశ్నలు వేసే అలవాటు పెంపొందించాలి. సంప్రదాయ మీడియా పాత్ర కూడా మరింత బాధ్యతాయుతంగా ఉండాలి. సోషల్ మీడియాలో వైరల్ అయిందని వార్తగా ప్రచురించడం ప్రమాదకరం. ప్రతి వీడియో, ప్రతి ఫోటో, ప్రతి ఆడియోను సాంకేతికంగా ధృవీకరించే వ్యవస్థలను మీడియా సంస్థలు బలోపేతం చేయాలి. వేగం కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకసారి ప్రచురించిన తప్పుడు సమాచారం సమాజంలో కలిగించే నష్టాన్ని తిరిగి సరిచేయడం చాలా కష్టం. ప్రభుత్వం కూడా ఈ రంగంలో సమగ్ర విధానాన్ని రూపొందించాలి. డీప్‌ఫేక్‌లను సృష్టించి మోసాలకు, పరువునష్టం కలిగించడానికి, ఎన్నికలను ప్రభావితం చేయడానికి ఉపయోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టాలను సమతుల్యంగా అమలు చేయాలి. నియంత్రణ పేరుతో విమర్శలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి హానికరం. టెక్నాలజీ కంపెనీల బాధ్యత కూడా తక్కువ కాదు. డీప్‌ఫేక్‌లను గుర్తించే ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, కృత్రిమంగా రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపులు ఇవ్వడం, నకిలీ కంటెంట్‌పై వేగంగా చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో మరింత చురుకుదనం అవసరం. ఏఐని రూపొందించే సంస్థలే, ఏఐ దుర్వినియోగాన్ని అడ్డుకునే పరిష్కారాలను కూడా అందించాలి. ఇక ప్రతి పౌరుడు కూడా ఒక బాధ్యతను గుర్తుంచుకోవాలి. ఫార్వర్డ్ చేసే ముందు ఒకసారి ఆలోచించడం, నిజానిజాలు తెలుసుకోవడం, అపోహలను వ్యాప్తి చేయకపోవడం డిజిటల్ పౌరుడి కనీస కర్తవ్యం.



## ఖాళీ కుర్చీ

గదిమూలన
ఖాళీ కుర్చీ ఇప్పటికీ
తలుపు వైపే చూస్తోంది...

వచ్చే అడుగుల శబ్దాన్ని
ముందుగా గుర్తుపట్టేది
అదే కాబోలు.

వేసవి సాయంత్రంలో
వీసే చల్లని గాలిలా
నా జీవితంలోకి వచ్చావు.

మూసుకుపోయిన కిటికీలకు
మళ్లీ వెలుతురు ఉంటుందని
నమ్మించావు.

ఎండిన కొమ్మల మధ్య
చిగురులు మొలిచినట్టు
రోజులు నవ్వడం మొదలుపెట్టాయి.

నా మౌనానికి
నీ మాటలు అవసరం కాలేదు...
నీ ఉనికే చాలనిపించింది.

ఒక రోజు...

గదిలోని వస్తువులన్నీ
అదే చోటున్నాయి.

మారిపోయింది మాత్రం
ఆ కుర్చీ ఎదురుచూపు.

నీ గూడు
నీవు కట్టుకున్నావు...

నా గదిలో మాత్రం
ఇంకా రెండు కప్పుల టీకి
చోటు ఖాళీగానే ఉంది.

వెళ్లిపోయింది
నువ్వు మాత్రమే కాదు...

ఎవరో ఒకరు వచ్చి
ఈ కుర్చీలో కూర్చుంటారని
ప్రతి సాయంత్రం
నిశ్శబ్దంగా ఎదురుచూసే
నా లోపలి మనిషి కూడా.



**తనూజా వెంకట్**
9901270639




# యూరప్‌లో మంటలు.. భారత్‌కూ తంటాలు

**వేసవి అంటే ఎండలు సహజమే. కానీ ఇప్పుడు ప్రపంచం చూస్తున్నది సాధారణ వేసవి కాదు. తీవ్ర వేడి గాలుల యుగం. ఒకప్పుడు చల్లని వాతావరణానికి ప్రసిద్ధి చెందిన యూరప్‌లోనే ఉష్ణోగ్రతలు 40-45 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, గ్రీస్, పోర్చుగల్ వంటి దేశాలు వరుసగా తీవ్రమైన హీట్‌వేవ్‌లను ఎదుర్కొంటున్నాయి. వేలాది హెక్టార్ల అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి.**

పంటలు ఎండిపోతున్నాయి. నదులు, జలాశయాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. విద్యుత్ వినియోగం పెరిగి శక్తి వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారిపై వేడి తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది ఒక్క ఏడాది సమస్య కాదు. గత కొన్నేళ్లుగా యూరప్‌లో వేడి గాలుల తీవ్రత, తరచుదనం రెండూ పెరుగుతున్నాయి. వాతావరణ శాస్త్రవేత్తలు దీన్ని గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులతో నేరుగా అనుసంధానిస్తున్నారు. పారిశ్రామిక విప్లవం తర్వాత పెరిగిన గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు భూమి సగటు ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి. దాని ప్రభావం ఇప్పుడు ప్రతి ఖండంపైనా కనిపిస్తోంది. ఈ దృశ్యాలను భారత్ దూరంగా ఉండి చూసే పరిస్థితి లేదు. మన దేశం ఇప్పటికే తీవ్రమైన ఉష్ణోగ్రతలు, అనిశ్చిత వర్షపాతం, ఎండలు, వరదలు, తుఫాన్లను ఎదుర్కొంటోంది. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణాది వరకు ప్రతి వేసవిలో కొత్త ఉష్ణోగ్రత రికార్డులు నమోదవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడం ఇప్పుడు అసాధారణం కాదు.

తెలంగాణ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, తగ్గుతున్న పచ్చదనం, చెరువుల ఆక్రమణ, భూగర్భ జలాల క్షీణత కలిసి ఉష్ణోగ్రతలను మరింత పెంచుతున్నాయి. హైదరాబాద్‌లో అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నగర శివార్లతో పోలిస్తే నగర మధ్య ప్రాంతాల్లో పగలు మాత్రమే కాదు, రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు పగటి వేడిని నిల్వచేసి రాత్రి విడుదల చేయడం వల్ల ప్రజలు ఉపశమనం పొందలేకపోతున్నారు. వేడి గాలుల ప్రభావం కేవలం అసౌకర్యానికి పరిమితం కాదు. ఇది ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యుత్, నీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేస్తుంది. రైతు పొలంలో పంట ఎండిపోతుంది. నగరాల్లో విద్యుత్ వినియోగం పెరిగి సరఫరాపై ఒత్తిడి ఏర్పడుతుంది. తాగునీటి అవసరాలు పెరుగుతాయి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, డెలివరీ సిబ్బంది, నిర్మాణ కార్మికులు, ట్రాఫిక్ పోలీసులు వంటి వర్గాలు నేరుగా ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటారు. యూరప్‌లోని అనేక దేశాలు ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి హీట్ యాక్షన్ ప్లాన్‌లు, నగరాల్లో పచ్చదనం పెంపు, తెల్లటి పైకప్పులు, గ్రీన్ రూఫ్‌లు, నీడనిచ్చే వృక్షాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు వంటి చర్యలను అమలు చేస్తున్నాయి. ప్రజారోగ్య శాఖలు హీట్ అలర్ట్ వ్యవస్థలను బలోపేతం చేశాయి. నగర ప్రణాళికలో వాతావరణ మార్పులను కీలక అంశంగా పరిగణిస్తున్నాయి.

భారత్ కూడా ఇదే దిశగా వేగంగా అడుగులు వేయాలి. కొన్ని రాష్ట్రాలు హీట్ యాక్షన్ ప్లాన్‌లను అమలు చేస్తున్నప్పటికీ, వాటిని గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, కార్మిక రంగం, వ్యవసాయం.. ప్రతి రంగంలో వేడి ప్రభావాన్ని తగ్గించే ప్రత్యేక కార్యాచరణ ఉండాలి. తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ, భారీ స్థాయిలో వృక్షారోపణ, పట్టణాల్లో గ్రీన్ కారిడార్లు, వర్షపు నీటి సంరక్షణ, భవన నిర్మాణాల్లో పర్యావరణహిత ప్రమాణాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బలోపేతం వంటి చర్యలు ఇక అభివృద్ధి కార్యక్రమాలు మాత్రమే కాదు; వాతావరణ అనుకూలతకు అవసరమైన వ్యూహాలు. ప్రతి పౌరుడి పాత్ర కూడా అంతే ముఖ్యం. ఒక చెట్టు నాటడం, నీటి వృథాను తగ్గించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దోహదపడతాయి. వాతావరణ మార్పు ప్రభుత్వాల సమస్య మాత్రమే కాదు; సమాజం మొత్తం కలిసి ఎదుర్కోవాల్సిన సవాలు.



**అలేఖ్య కట్కం**



వానమ్మ ఓ సారి...
వచ్చి పోవమ్మ..!
సేను చెలుకలు
బీటలు బారినవి
ఎద్దు ఎవుసం
మొద్దు బారినది
పంట సాగుచేద్దామన్న
ఒక వాన లేదు
ఒక వాగు లేదు
కౌలు ధరలేమో
ఆకాశనంటుకున్నాయి
నేలమీద ఒక విత్తునాటలేదు
కడుపుకట్టి కౌలుకడితిని
ఉత్తచేతులతో ...
కుటుంబానికి పస్తులుంచితిని
ఓ వానమ్మా
ఓ సారి వచ్చి పోవమ్మ..!



**నాగం సాయిలు**
(నానీ మీగడలు రచయిత)
9490209037

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.